తిరుమల తరహాలో వాడపల్లి క్షేత్రం అభివృద్ధి

అత్యాధునిక అన్నప్రసాద భవనం ప్రారంభం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం వాడపల్లి ఆలయ ప్రాంగణంలో సీజీఎఫ్ నిధులు రూ.6.25 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన వకుళమాత అన్నప్రసాద భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రసాద్ పథకం కింద నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. నూతన అన్నదాన భవనంలో ఒకేసారి 3వేల మందికి భోజనాలు, ఆధునిక పరికరాలతో రోజుకు సుమారు 40 వేల మందికి ప్రసాదం సిద్ధం చేసేలా సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఆలయానికి సునాయసంగా చేరుకునేందుకు రూ.8 కోట్లతో రావులపాలెం నుంచి ఏటిగట్టు రహదారి అభివృద్ధి చేయనున్నామని, ఇందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.6 కోట్లు నిధులు అందజేశారన్నారు. అన్నదాన భవనానికి పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.1.50 కోట్లు ఇచ్చారని, భవిష్యత్తులో మరో రూ.50 లక్షలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తణుకు, ఆచంట ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, గుత్తుల సాయి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, శ్రీరామరాజు పాల్గొన్నారు.


వంటశాలలో ఆహార పదార్థాల తయారీని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, తదితరులు

పేరుకే సాగుపై హక్కు.. రుణాలు ఎన్నటికి దక్కు

కౌలురైతుకు సీసీఆర్ కార్డుల జారీలో జాప్యం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

జిల్లాలో కౌలు రైతులు కన్నీరుపెడుతున్నారు. సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్ కార్డులు) జారీ చేయక.. పంట రుణాలు దక్కక అవస్థలు పడుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో మెట్ట ప్రాంతంలోని కొంత ఆయకట్టులో బోర్ల కింద ఖరీఫ్ సాగు చేసిన కౌలురైతులు పెట్టుబడికి సొమ్ములేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లక్ష్యంలో సగమే.. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 70 వేల సీసీఆర్ కార్డులు జారీకి ఆదేశించారు. ఇప్పటికి 34,742 మందికి మాత్రమే ఇచ్చారు. సీజన్ ముమ్మరంగా సాగుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు. పది మండలాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది.

రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం

- ఏటా 11 నెలల కాలానికి పంట మీద హక్కు కల్పిస్తూ ఈ కార్డులు జారీ చేస్తున్నారు. గతంలో వీటిని పొందిన వారికి రెన్యువల్ చేయడం, కొత్తవి జారీ చేయడం రివాజుగా వస్తోంది.
- 2026-27 ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలైనా కార్డుల జారీలో రెవెన్యూశాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.
- మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించినా.. క్షేత్రస్థాయిలో వీఆర్వోల అలక్ష్యంతో కౌలురైతులు అల్లాడుతున్నారు.
- జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 2,23,578 ఎకరాల్లో అన్ని రకాల పంటల సాగు లక్ష్యం కాగా, ఇప్పటికి 1.80 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. 1.50 లక్షల మంది రైతులు ఉండగా, వీరిలో 90 వేల మంది వరకు కౌలురైతులే ఉన్నారు.
- వీరు సాగు చేసినా సీసీఆర్ కార్డుల్లేక పంట రుణాలు పొందలేకపోతున్నారు.

మండలం	కార్డులు	జారీ
ప్రత్తిపాడు	2,662	682
పెదపూడి	5,535	1,659
రౌతులపూడి	1,553	480
యు.కొత్తపల్లి	2,352	739
గొల్లప్రోలు	4,402	1,465
కరప	4,962	1,911
శంఖవరం	2,152	858
ఏలేశ్వరం	1,832	801

రూ.10 కోట్లే మంజూరు..

కౌలు రైతులకు బ్యాంకులు ఏటా పెద్ద మొత్తంలో పంట రుణాలు కల్పిస్తామని లక్ష్యాలు నిర్దేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. 2026-27 ఏడాదికి రూ.287 కోట్ల మేర రుణాల కల్పించాలని వార్షిక ప్రణాళికలో ప్రకటించారు. ఇప్పటికి 34,742 మందికి కార్డులున్నా కేవలం 3,695 మందికి రూ.10.69 కోట్లు మాత్రమే రుణాలు అందించారు.

సొంతంగా సాగుచేసిన వారికి అంతే..

సొంతంగా సాగు చేసుకునే రైతులకు 2026-27లో పంట రుణాలు కింద రూ.4,639 కోట్లు లక్ష్యంగా కాగా, ఇప్పటికి రూ.1,752 కోట్లు ఇచ్చారు. టర్మ్ రుణాలు కింద రూ.4,880 కోట్లు పంపిణీ లక్ష్యం కాగా, ఇప్పటికి రూ.4,126 కోట్లు అందించారు.

చిలుకల కనువిందు

తాళ్లరేవు మండలం కోరింగ పంచాయతీ పరిధిలోని చినబొడ్డువెంకటాయపాలెం జగనన్న కాలనీలోని ఆటోడ్రైవర్ వాడ్రేవు బాలకృష్ణ ఇల్లు చిలుకలకు ఆహార కేంద్రంగా మారింది. ఆయన ఏడాది కిందట తన ఇంటిపై పిచ్చుకల కోసమని ధాన్యం కుచ్చు కట్టారు. అవి రాలేదుగానీ కొద్ది రోజులకు రెండు రామచిలుకలు చేరాయి. నిత్యం ఆహారం అందుబాటులో ఉంచడంతో పదులు.. వందల సంఖ్యకు చేరాయి. బాలకృష్ణతోపాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు రోజూ ఆహారం సిద్ధం చేస్తారు. వీటి ఆహారానికి నెలకు రూ.6వేలు వెచ్చిస్తున్నానన్నారు. ధాన్యం గింజలను కొందరు పక్షి ప్రేమికులు కొనుగోలు చేసి ఇస్తున్నారని చెప్పారు.





- న్యూస్‌టుడే, తాళ్లరేవు

ఇక్కడ అడుగు వేసేదెలా?

కాకినాడ నుంచి సామర్లకోటకు వచ్చే ప్రధాన రహదారిలోని సామర్లకోట రైల్వేస్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్ పరిస్థితి ఇది.. దీనిపై ఉండే సిమెంటు పలకలు పాడైపోయి ప్రమాదకరంగా మారాయి. ఇక్కడే ఉన్న భీమేశ్వర స్వామి ఆలయం దర్శనానికి వచ్చే భక్తులు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో దిగి ఇదే మార్గంలో ఆలయానికి వెళ్తారు. ఫుట్‌పాత్ ప్రమాదకరంగా మారటంతో గత్యంతరం లేని పరిస్థితిల్లో వేగంగా రాకపోకలు సాగించే వాహనాల మధ్య రహదారిపై నడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు దీనికి అనుకొని ఉన్న గోదావరి కాలువకు ఉన్న రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి.


ఫుట్‌పాత్ పరిస్థితి ఇది..

- ఈనాడు, కాకినాడ

కొండను తవ్వేసి.. దర్జాగా దోచేసి

ప్రత్తిపాడులో అక్రమార్కుల ఇష్టారాజ్యం

న్యూస్‌టుడే, ఏలేశ్వరం, (ప్రత్తిపాడు) శంఖవరం

అక్రమార్కులు పెద్ద పథకాన్నే వేశారు. మారుమూల ప్రాంతాల్లో ఇప్పటివరకు అనుమతి లేని తవ్వకాలు చేస్తున్న అవినీతిపరుల చూపు.. ఇపుడు ఏకంగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కొండపైన పడింది. కొండను తవ్వితే ఇటు గ్రావెల్, మెటల్ అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. మరోవైపు ఖాళీ అయిన ప్రదేశంలో దుకాణాలు నిర్మించి అద్దెలు దండుకోవచ్చుననే దురాలోచన చేశారు. రోజూ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు రాకపోకలు సాగించే హైవే అంచునే ఉన్న 'గిరి' తవ్వకాలను దర్జాగా ప్రారంభించారు. ప్రత్తిపాడు పరిధిలో 'గోవిందపురం' పేరుతో పిలిచే కొండను స్వాహా చేసేందుకు జోరుగా ప్రయత్నాలు సాగుతున్నాయి.


మట్టి తవ్వకాలు జరిగిన ప్రదేశం

30 ఎకరాల విస్తీర్ణంలో.. ప్రత్తిపాడు రెవెన్యూ పరిధిలోని గోవిందపురం కొండ 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉంటుంది. దిగువన ఉన్న కొంత ప్రదేశాన్ని మండల కేంద్రానికి చెందిన పేదలకు గతంలో డీ పట్టాలు ఇచ్చారు. ఈ భూమిలో మామిడి, జీడి మామిడి తదితరాలను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ కొండ దిగువ భాగం నుంచి అనుమతి లేని తవ్వకాలను చేపట్టారు. యంత్రాలతో తవ్వేసి ప్రకృతి సంపదను కొల్లగొట్టేశారు. ఒక్కో ట్రాక్టర్ గ్రావెల్ రూ.1500, మెటల్ రూ.2500 వంతున విక్రయించారు. హైవే విస్తరణ కోసమే ఈ తవ్వకాలు అని కొన్నాళ్లు నమ్మించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. ఫిర్యాదు నేపథ్యంలో పనులకు విరామం ప్రకటించిన ప్రబుద్ధులు అదను కోసం ఎదురుచూస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లలో వచ్చి ఖనిజాన్ని తరలించుకుపోతున్నారు. రాజమహేంద్రవరం- తుని నంబరు 16 హైవేలో పాదాలమ్మ ఆలయం ప్రముఖమైంది.

పాదాలమ్మ గుడిని ఆనుకుని తవ్వకాలు నియోజకవర్గ కేంద్రం సమీపానే ఉన్న ఈ గుడి వెనుక, చెంతనే ఉన్న కొండను యంత్రాలతో కొల్లగొట్టేశారు. ఇక్కడే ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వయోవృద్ధ నిలయం ఉంది. ఆధ్యాత్మిక కేంద్ర పరిసరాలకు తూట్లు పొడిచారు.

అనర్థాలివీ.. గుట్టలు కొండలు తవ్వేస్తే పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇష్టారాజ్యంగా తవ్వేస్తుంటే కొండ దిగువన పోడు సాగుకు, ఆలయానికి నష్టం జరుగుతుంది. భవిష్యత్తులో కొండ చరియాలు విరిగిపడొచ్చు. సుమారు కి.మీ.కు పైగా కొండ ప్రకృతి అందాలకు చిరునామాగా ఉంటోంది. ఇవన్నీ కనుమరుగైతే ఉష్ణోగ్రతలు అధికమవుతాయి. అధికారులు తరచూ క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టి గోవిందపురం గిరిని పరిరక్షించాల్సి ఉంది.

రేపు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 2,65,439 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద సెప్టెంబరు నెలకు రూ.115.65 కోట్లు పింఛను సొమ్ము విడుదలైనట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. కొత్తగా 272 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేశారని చెప్పారు. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి 620 స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజే నూరు శాతం పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు.

బయటకొస్తే బిగపట్టుకోవాల్సిందే!

కాకినాడలో మరుగుదొడ్లు నిరుపయోగంతో ఇక్కట్లు

ఈనాడు పరిశీలన

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

కాకినాడ ఆకర్షణీయ నగరం (స్మార్ట్‌సిటీ)గా ఎంపికైంది. ఆ దిశగా పార్కులు, రోడ్లు, కాలువలు వంటి అనేక సదుపాయాలను సొంతం చేసుకుంది. అయితే 'మరుగు' విషయానికి వస్తే కాస్త తలదించుకోవాల్సిందే. ఎందుకంటే నగరంలో పలు జనసమ్మర్ద ప్రదేశాలలో ఏర్పాటు చేసిన మురుగుదొడ్లు, మూత్రశాలల్లో సగానికి పైగా నిర్వహణ కొరవడి పనిచేయటం లేదు. అవసరమైన చోట్ల అవి లేక పోవడంతో కష్టాలు తప్పటం లేదు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన సందర్శకులు కాలకృత్యాలు తీర్చుకునే దారిలేక ఇంటికెళ్లేవరకు బిగపట్టుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్మార్ట్ సిటీ అంటే ఇదేనా అని పెదవి విరుస్తున్నారు.

నగర జనాభా:	రోజూ వచ్చే సందర్శకుల సంఖ్య:	ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలు:	పని చేస్తున్నవి:	వినియోగానికి దూరంగా ఉన్నవి:	పూర్తిగా పాడైనవి:	ఇంకా అవసరమైనవి:
4 లక్షల పైనే	50 వేల నుంచి లక్ష వరకు	50	12	26	12	50

ప్రదేశం: జీజీహెచ్



పరిస్థితి: జిల్లా పరిషత్ సెంటర్‌లో జీజీహెచ్ ప్రహరీ, రంగరాయ విద్యార్థుల వసతి గృహానికి చేర్చి గతంలో రెండు మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ఇవి ఈ ప్రాంతానికి వచ్చే సందర్శకులకు ఉపయుక్తంగా ఉండేవి. రానురాను నిర్వహణ కొరవడింది. నీళ్లు లేవు. అవి నిరుపయోగంగా మారాయి.

స్మార్ట్‌సిటీ బస్టాండ్



ప్రగతి భవన్ ఎదురుగా స్మార్ట్‌సిటీ బస్టాండ్ వద్ద ప్రయాణికులు అధికసంఖ్యలో ఉంటారు. ఇక్కడ మహిళలు, వృద్ధులకు ఎంతో అవసరం. ఇక్కడ మాత్రం ఎప్పుడు తాళం వేసి ఉంటుంది.

జిల్లా గ్రంథాలయ సంస్థ

జిల్లా గ్రంథాలయ సంస్థ, టౌన్ హాలు వద్ద కాలి బాటలపై స్వచ్ఛభారత్‌లో భాగంగా రెండు మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ఇవి కూడా వినియోగానికి దూరంగా ఉన్నాయి.



భానుగుడి సెంటర్

భానుగుడి సెంటర్ బస్టాప్ వద్ద ప్రయాణికులు, సందర్శకుల కోసం మూత్రశాల, మరుగుదొడ్డి ఏర్పాటు చేశారు. వీటికి నీటి సదుపాయం కల్పించటంతో అందరికీ ఉపయుక్తంగా ఉండేవి. ప్రస్తుతం మరమ్మతులకు గురై అలంకార ప్రాయంగా ఉన్నాయి.



సర్పవరం జంక్షన్

సర్పవరం జంక్షన్‌లో బస్టాండ్ వద్ద స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా పురుషులు, మహిళలకు వేర్వేరుగా అధునాతన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను ఏర్పాటు చేశారు. ఇది కొంతకాలం పాటు సక్రమంగానే నడిచింది. ప్రస్తుతం నిర్వహణ కొరవడి మూతపడింది.



ఇక్కడ ఎంతో అవసరం

నగరంలో జనసంచారం ఎక్కువగా ఉంటే నాగమల్లి జంక్షన్, ఆర్టీవో కార్యాలయ జంక్షన్, డెయిరీ ఫారం సెంటర్, ఘాటీ సెంటర్, భానుగుడి ఘాటీ సెంటర్, ప్రభుత్వ ఐటీఐ సెంటర్, జగన్నాథపురం ఎంఎస్ఎన్ ఛారిటీ సెంటర్, కల్పనా సెంటర్, గొడారిగుంట సెంటర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ కూడలి వద్ద, తదితర ప్రాంతాలలో మరుగుదొడ్లు లేవు.

- గొడారిగుంట నుంచి డెయిరీఫారం వచ్చే రోడ్డులో, ఎస్.అచ్యుతాపురం రైల్వేగేటు వద్ద రెడ్‌క్రాస్‌కు వెళ్లేదారిలో ఏత అయిదేళ్ల కిందట గ్రీన్ టాయ్‌లెట్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ వాటిని వినియోగంలోకి తేకపోవడంతో అవి అలంకార ప్రాయంగా మిగిలాయి.
- సంజయ్‌నగర్ క్రైస్తవ శ్మశాన వాటిక వద్ద స్వచ్ఛ భారత్‌లో భాగంగా రెండేళ్ల కింద సామాజిక మరుగుదొడ్డిని ఏర్పాటు చేశారు. దీనికి విద్యుత్తు, నీటి సదుపాయిన్ని సైతం కల్పించారు. ఇప్పటి వరకు దానిని వినియోగంలోకి తేలేదు.

మార్పులో మతలబు ఏమిటో?

రూ.20.77 కోట్ల శంకరగుప్తం డ్రెయిన్ డ్రెడ్జింగ్ వ్యవహారం

న్యూస్‌టుడే, పి.గన్నవరం, మలికిపురం

రాజోలు దీవిలోని సముద్ర తీరంలో ఉప్పునీటి ప్రభావంతో కొబ్బరి చెట్లకు వాటిల్లుతున్న నష్టాన్ని నివారించేందుకు శంకరగుప్తం ప్రధాన మురుగు కాలువను ఆధునికీకరించేందుకు కూటమి ప్రభుత్వం గత డిసెంబరులో రూ.20.77 కోట్లు మంజూరు చేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా విచ్చేసి మలికిపురం మండలం కేశనపల్లి వద్దగల ప్రధాన మురుగు కాలువను, చనిపోయిన చెట్లను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కృషితో నిధులు మంజూరు కావడం, టెండర్లు పిలవడం, గుత్తేదారు ఖరారు కావడం చకచకా పూర్తయ్యాయి. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పనులు మొదలుపెట్టారు. తాజాగా ఒక విభాగం నుంచి మరో విభాగానికి ఈ పనులను బదలాయించడం ఎవరి ప్రయోజనం కోసమోనని సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.


డ్రెయిన్‌లో పూడికతీత పనులు

ఓ రాజకీయ నాయకుడి ఒత్తిడితో..

శంకరగుప్తం ప్రధాన మురుగు కాలువ పనుల బాధ్యత డ్రెయినేజీ విభాగానికి వస్తుంది. గత రెండేళ్లుగా ఈ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి అంచనా తయారు చేసి ఉన్నత స్థాయి అధికారులకు పంపారు. వీరి ఆధ్వర్యంలోనే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పనులు జరుగుతున్నాయి. ఉన్నట్టుండి ఈ పనులను ఈ డివిజన్ నుంచి గోదావరి మధ్యడెల్టా ఇరిగేషన్ డివిజన్‌కు బదలాయిస్తూ జలవనరులశాఖలోని ఉన్నతాధికారి ఆదేశాలు ఇచ్చారు. ఈ చర్య విమర్శలకు తావిస్తోంది. ఓ రాజకీయ నాయకుడి ఒత్తిడే దీనికి కారణమని చర్చించుకుంటున్నారు.

మధ్యడెల్టాకు బదలాయింపు

శంకరగుప్తం ప్రధాన మురుగుకాలువ ఆధునికీకరణ పనుల పర్యవేక్షణను డ్రెయినేజీ విభాగం నుంచి గోదావరి మధ్యడెల్టాకు బదలాయిస్తూ ఉన్నతాధికారి ఉత్తర్వులు ఇచ్చారని గోదావరి మధ్యడెల్టా ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

రావాల్సిందే.. అర్జీలు తీసుకోవాల్సిందే

ప్రతిరోజూ సచివాలయాల్లో పీజీఆర్ఎస్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇప్పటివరకు ప్రతి సోమవారం మండల, డివిజన్, కలెక్టరేట్, స్వర్ణ గ్రామ, వార్డుల్లో (సచివాలయాలు) ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వహణ, వినతుల స్వీకరణపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. దీనిలో స్వర్ణ గ్రామ, వార్డుల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై సెలవుదినాలు మినహా ప్రతిరోజూ కార్యాలయ పనివేళల్లో స్వర్ణ గ్రామ, వార్డుల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో స్వర్ణ గ్రామ, వార్డులు - 620
విధుల్లో ఉన్న సిబ్బంది సంఖ్య - 4,900

కీలక ఉద్యోగులు అందుబాటులో ఉండరే.. స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలకు సర్వే, వ్యవసాయ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, ఏఎన్ఎంలు ఉదయాన్నే వచ్చి సంతకాలు చేసి పనుల పేరుతో బయటకు వెళ్తున్నారు. అర్జీలు ఇవ్వడానికి వస్తున్న ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో చిన్నపాటి సమస్య పరిష్కారానికి కూడా పలువురు కలెక్టరేట్‌కు రావాల్సిన పరిస్థితి వస్తోంది. జిల్లా కేంద్రానికి వెళ్లడానికి అదనపు ఖర్చు అవుతోంది.


ఏలేశ్వరం మండలం, లింగంపర్తి గ్రామ సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీడీవో వేణుగోపాల్

మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. సచివాలయ సిబ్బందిలో జవాబుదారీతనం, సేవల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా పనిదినాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రోజూ స్వర్ణ గ్రామ, వార్డుల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని విభాగాల సిబ్బంది విధిగా అందుబాటులో ఉండాలి. సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలి. గ్రామ, వార్డు స్థాయిలోనే సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని కాకినాడ డీడీవో జే.వేణుగోపాల్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్, మండల, పట్టణ స్థాయిలోనూ పీజీఆర్ఎస్ జరుగుతుందని తెలిపారు.

కడియపులంక నర్సరీ సంఘ అధ్యక్షుడిగా సుబ్బారాయుడు

కడియం: కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్ష పదవికి బొరుసు సుబ్బారాయుడు, రత్నం అయ్యప్ప అభ్యర్థులు పోటీపడ్డారు. 1,621 ఓట్లు పోలయ్యాయి. సుబ్బారాయుడుకు 985 ఓట్లు, రత్నం అయ్యప్పకు 629 ఓట్లు వచ్చాయి. 356 ఓట్ల ఆధిక్యంతో సుబ్బారాయుడు నూతన అధ్యక్షుడిగా గెలుపొందారు. ఏడు ఓట్లు చెల్లనివిగా తేల్చారు. దూలం సత్యనారాయణమూర్తి 85 ఓట్లు, పుల్లా శ్రీను 96 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

పీజీ నీట్‌కు 98.95 శాతం మంది హాజరు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం నిర్వహించిన పీజీ నీట్ ప్రశాంతంగా ముగిసింది. కాకినాడ నగరంలోని ఐయాన్ డిజిటల్ జోన్, కాకినాడ గ్రామీణం రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీస్, గండేపల్లి మండలం, సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో కలిపి మొత్తం అయిదు కేంద్రాల్లో ఈ పరీక్షను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఐయాన్ డిజిటల్ జోన్, సాఫ్ట్ టెక్నాలజీస్ కేంద్రాలను తనిఖీ చేశారు. వీటిలో వసతుల కల్పన, విద్యార్థుల హాజరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మొత్తం 1,159 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 1,147 మంది పరీక్ష రాశారని, 98.95 శాతం హాజరు నమోదదైందని కలెక్టర్ తెలిపారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

లోవకు భక్తుల తాకిడి



తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దేవస్థానంలోని క్యూలైన్లు, వసతి గదులు నిండిపోయాయి. భక్తులు ఆలయ ప్రాంగణంలోని చెట్లకింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 10 వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానానికి రూ. 5.01 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

సముద్రతీరంలో డ్రోన్ కెమెరాల నిఘా



సూర్యారావుపేట (కరప), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ బీచ్‌లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో సముద్రతీర ప్రాంతానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చి ఉల్లాసంగా గడిపారు. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు తిమ్మాపురం, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డ్రోన్ కెమెరాలను వినియోగించి పర్యవేక్షించారు.

బ్యాగు దొరికింది.. సంతోషం నింపింది



సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఓ మహిళ ఆర్టీసీ బస్సులో మర్చిపోయిన బ్యాగును సిబ్బంది తిరిగి అప్పగించారు. విజయవాడ నుంచి కాకినాడ ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మహిళ తన బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగును మర్చిపోయి కాకినాడ వైపు స్టార్ కూడలి వద్ద దిగి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లాక బ్యాగు కనిపించకపోవడంతో ఆమె తిరిగి డిపో వద్దకు చేరుకున్నారు. సిబ్బంది సహకారంతో సంబంధిత బస్సును తనిఖీ చేయగా బ్యాగు అక్కడే ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. అందులో సుమారు రూ.3.60 లక్షలు విలువ చేసే ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. బస్సు డ్రైవర్ బీఎస్ఎస్ వాసు, సెక్యూరిటీ సిబ్బంది, ఆన్ డ్యూటీ కంట్రోలర్ సమక్షంలో బ్యాగును అప్పగించారు.

సమగ్ర సంతృప్తికర సేవల దిశగా అడుగులు



చక్రధరరావు, ఈవో

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు పూర్తిస్థాయిలో సంతృప్తికర సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక చేస్తున్నామని ఈవో చక్రధరరావు తెలిపారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పలు అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు. ఆయనేమన్నారంటే..

● **ఆధునిక సాంకేతికతతో అందరికీ వసతి** : స్వామి దర్శనానికి వచ్చే భక్తులు అందరికీ వసతి కల్పించాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం సుమారు 500 గదులు ఉన్నాయి. రద్దీ రోజులు, పర్వదినాలు, పెళ్లిళ్ల సమయంలో సరిపోవడం లేదు. నూతనంగా సీతారామ వసతి సముదాయం నిర్మాణం జరుగుతుంది. సత్యగిరిపై తితిదే సహకారంతో మరో 135 గదుల వసతి సముదాయాన్ని నిర్మించాలని భావిస్తున్నాం. దీనిపై ఇటీవల ధర్మకర్తల మండలిలో తీర్మానం జరిగింది. అనుమతులు వచ్చి నిర్మాణం జరిగితే వసతి ఇబ్బందులు ఉండవు. దళారులకు కళ్లెం వేస్తున్నాం. ఆధార్ సరిపోల్చిన తర్వాతే గది కేటాయిస్తున్నాం. ఈ చర్యలతో ఇటీవల రద్దీ సమయాల్లో సత్ఫలితాలొచ్చాయి. నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా మరింత పకడ్బందీగా భక్తులకు వసతి కేటాయింపు పక్కాగా పారదర్శకంగా జరుగుతుంది.

● **త్వరలోనే నూతన అన్నదాన భవనం**: కేంద్ర పథకం 'ప్రసాద్' ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అన్నదాన భవనం కొద్ది నెలల్లోనే అందుబాటులోకి రానుంది. ఆధునిక వంటశాల నిర్మాణానికి ప్రణాళిక చేశాం. నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందిస్తాం. గోదుమనూక ప్రసాదాన్ని మరింత నాణ్యంగా అందించేందుకు నిత్యం పర్యవేక్షిస్తున్నాం. దుకాణాల్లో అధిక ధరల విక్రయాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకున్నాం.

● **విస్తృత తనిఖీలతో భక్తులకు భరోసా**: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతపై దృష్టిసారించాం. తనిఖీలు విస్తృతం చేశాం. టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేసిన తర్వాతే కొండపైకి అనుమతిస్తాం. మద్యం సీసాలు ఎవరి వాహనాల్లో అయినా దొరికితే కఠిన చర్యలు ఉంటాయి. మద్యం తాగి వాహనాలు నడిపినట్లు తనిఖీల్లో బయటపడ్డా ఉపేక్షించం. అటువంటి వారికి జరిమానా విధించేలా ప్రణాళిక చేస్తాం.

ప్రతిభకు పతకాలు.. భవితకు బాటలు

పిఠాపురం బాస్కెట్‌బాల్ క్రీడాకారుల సత్తా

న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం పట్టణానికి బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్ర్యానికి ముందు నుంచి ఇక్కడ బాస్కెట్‌బాల్ ఆడే వారి సంఖ్య ఎక్కువే. తొలినాళ్లలో సీఎంసీ ఆసుపత్రి ఆవరణలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకుని సాధన చేసేవారు. ఆ తరువాత ఏకే పీఎం పాఠశాలలో పలువురికి నేర్పించారు. ఇప్పుడు ఓబీఎస్ పాఠశాల మైదానంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ఉచిత శిక్షణ జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 10 ఏళ్లలోపు విద్యార్థులంతా ఈ క్రీడపై ఆసక్తి చూపుతుంటారు. ఇక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారెందరో ఉన్నారు. సీనియర్ క్రీడాకారులు శిక్షకులుగా వ్యవహరిస్తారు. ఇక్కడ నేర్చుకున్నవారెందరో ప్రస్తుతం వ్యాయామోపాధ్యాయులుగా, పోలీసు తదితర శాఖల్లో ఉద్యోగులుగా స్థిరపడడం విశేషం.



పిఠాపురంలో బాస్కెట్‌బాల్ సాధనలో క్రీడాకారులు

బంగారు పతకాలతో అవకాశాలు..

జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించి బంగారు పతకాలు సాధిస్తున్న విద్యార్థులు క్రీడా కోటాలో ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో ఉచిత ప్రవేశాలు పొందుతున్నారు. తాజాగా కారుణ్య ఏంజల్, కీర్తన, ఎన్.శ్రీనివాస్(8వ తరగతి), కౌశిక్, అరవింద్ కుమార్(9వ తరగతి), రాగూర్(ఇంటర్), పీయూష్(ఇంజినీరింగ్) చదివేందుకు తిరుపతిలోని ఎంబీయూలో ఉచిత ప్రవేశాలు పొందారు. వీరికి అక్కడే విద్య, వసతి, క్రీడా శిక్షణ ఉచితంగా అందిస్తారు. క్రీడా కోటాతోనే వీరికి ఈ అవకాశం దక్కిందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మాణిక్యాలరావు తెలిపారు. అవకాశం దక్కించుకున్న పిల్లలంతా ఆటోడ్రైవర్లు, తండ్రి లేకపోతే తల్లి పోషణపై ఆధారపడినవారేనని ఆయన పేర్కొన్నారు.

ఉచిత విద్యకు ఎంపికయ్యా..



మాది జగ్గయ్యచెరువు. మా నాన్నగారు ఆటోడ్రైవర్. ఆయన సంపాదనపైనే మా కుటుంబం గడుస్తోంది. నాకు ఆటపై ఉన్న ఆసక్తితో బాస్కెట్‌బాల్ నేర్పించారు. బీఎంఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న నేను తిరుపతి ఎంబీయూలో ఉచిత విద్య ప్రవేశం పొందాను. ఉత్తరాఖండ్‌లో జాతీయ స్థాయి, మదనపల్లెలో అండర్-14 ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు తరపున తలపడ్డాను. క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువే నా లక్ష్యం. – పాల కారుణ్య ఏంజెల్

ఇంజినీరింగ్‌లో చేరుతా..



నాలుగేళ్లపాటు నేనూ పిఠాపురంలో బాస్కెట్‌బాల్ నేర్చుకున్నా. గతేడాది జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఏపీ జట్టు తరపున ఆడాను. అండర్ 17 స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించా. రాష్ట్ర, జిల్లా స్థాయిలోనే అనేక పతకాలు అందుకున్నా. స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్‌లో ఉచిత ప్రవేశానికి అవకాశం వచ్చింది. – పీయూష్, జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు



రవి దంపతులను సత్కరిస్తున్న అధికారులు

సేవలు ప్రశంసనీయం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమాచార, పౌరసంబంధాల శాఖలో 39 ఏళ్లకుపైగా వివిధ హోదాల్లో పెద్దింటి రవి అందించిన సేవలు ప్రశంసనీయమని సమాచార, పౌరసంబంధాల శాఖ జోన్-2 ఆర్జేడీ టి.తిమ్మప్ప కొనియాడారు. ఆదివారం స్థానిక టౌన్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ బ్లూమ్‌లో తూర్పుగోదావరి జిల్లా పౌరసంబంధాల అధికారి(డీపీఆర్వో)గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్న పెద్దింటి రవికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తిమ్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు మీడియా సమన్వయంలో రవి చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. తన ఉద్యోగ ప్రస్థానంలో అండగా నిలిచి ఆదరించి ప్రోత్సహించిన ఉన్నతాధికారులకు, ఉద్యోగులకు, మీడియా మిత్రులకు రవి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రవి దంపతులను సత్కరించారు. డీడీ పద్మజ, తూర్పుగోదావరి జిల్లా అధికారి లక్ష్మీనారాయణ, విశ్రాంత ఏడీ నాగార్జున, సీనియర్ పాత్రికేయుడు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతం

విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు



కృష్ణబాబు విగ్రహం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ కృష్ణబాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో గామన్ వంతెన కూడలిలో మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. దొమ్మేరులో బస్ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆంధ్రా సుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, కృష్ణబాబు విగ్రహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కైకలూరు శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో 'జమిందారు నుంచి జనం మనిషిగా ఎదిగిన ప్రజానేత' పేరిట ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మంచి, మానవత్వానికి కృష్ణబాబు ప్రతిరూపమన్నారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎంపీలు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడారు. కృష్ణబాబు సోదరుడు, తెదేపా నాయకుడు పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ తన అన్న పార్టీలు, కులాలకు అతీతంగా అందరికీ సహాయపడేవారన్నారు. కృష్ణబాబు కుమార్తె అర్చన మాట్లాడుతూ అందరి హృదయాల్లో స్థానం సంపాదించిన మహోన్నత వ్యక్తికి కూతురుగా పుట్టినందుకు గర్వపడుతున్నానని ఉద్వేగానికి లోనయ్యారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా తెదేపా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి పీతల సుజాత, జడ్పీ మాజీ ఛైర్మన్లు ఇమ్మణ్ణి రాజేశ్వరి, ముళ్లపూడి బాపిరాజు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, టీవీ రామారావు, కృష్ణబాబు అల్లుడు, తెదేపా నాయకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, అల్లూరి విక్రమాదిత్య, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కృష్ణబాబు కుటుంబ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు. చిత్రంలో అచ్చిబాబు, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు కామినేని, ముప్పిడి, తెలంగాణ మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ కేవీపీ, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు

స్కాన్ చేయండి.. స్పందన తెలియజేయండి



కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. పీజీఆర్ఎస్ మరింత పారదర్శకంగా, జవాబుదారీతనం దిశగా నిరంతర ప్రజాభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థలను బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జిల్లా, మండలస్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల్లో వివిధ మాధ్యమాల్లో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. పౌరులు పీజీఆర్ఎస్ తమ మొబైల్ ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని సూచించారు.

దేశంలో నిరుద్యోగం.. అప్పుల భారం

☛ అర్థశాస్త్ర ఉపన్యాసకులు భరత్



విలువ.. అదనపు విలువ పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న అర్థశాస్త్ర ఉపన్యాసకులు భరత్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతున్నా ప్రజల కొనుగోలు శక్తి అదే స్థాయిలో పెరగకపోవడంతో దేశంలో నిరుద్యోగం, అప్పుల భారం, మార్కెట్ సంక్షోభం పెరుగుతున్నాయని అర్థశాస్త్ర ఉపన్యాసకులు పి.భరత్ అన్నారు. ప్రముఖ విశ్లేషకులు రావు కృష్ణారావు రచించిన 'విలువ.. అదనపు విలువ' పుస్తకాన్ని పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 2008 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడిదారీ సంక్షోభాలతో మార్క్సిస్ట్ సిద్ధాంతాలను అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) డిజిటల్ ప్లాట్‌ఫారంలు ఉత్పత్తి రంగాన్ని వేగంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. విలువ.. అదనపు విలువ వంటి మార్క్సిస్టు రాజకీయ, ఆర్థిక శాస్త్ర గ్రంథాల అధ్యయనం ద్వారా విద్యార్థులు, కార్మికులు సమాజంలోని ఆర్థిక సంబంధాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం పుస్తకాన్ని దారిదీపం పత్రిక సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మకి అంకితమిచ్చారు. డాక్టర్ సి.కృష్ణ మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడి దుర్మరణం

మరో ముగ్గురికి గాయాలు



మృతి చెందిన శ్రీమంతుల కిషోర్

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జి.మేడపాడు కెనాల్ రోడ్డుపై ఆదివారం రాత్రి ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని పిఠాపురం ఇందిరానగర్‌కు చెందిన శ్రీమంతుల కిషోర్(22) అక్కడికక్కడే మృతి చెందగా జి.మేడపాడు మెట్టకు చెందిన నాని, సునీత, వారి కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కాకినాడ ఆసుపత్రికి, కిషోర్ మృతదేహాన్ని సామర్లకోట సీహెచ్‌సీకి తరలించారు.

ఫోన్ పే చేశా.. ఏదైనా తినేసి వస్తానన్నాడు..

మృతుడు కిషోర్ పిఠాపురంలో పచ్చబొట్లు వేయటం, ఫంక్షన్‌లలో తీన్‌మార్ డప్పు కొట్టేందుకు వెళుతుంటాడు. తల్లి ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉండడంతో చెల్లెలు విమల, తండ్రి వీరబాబుతో కలిసి రామచంద్రపురంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉండేవారు. కొన్నాళ్ల క్రితమే పిఠాపురం వచ్చేశారు. ఆదివారం పెదబ్రహ్మదేవంలో తీన్‌మార్ డప్పు కొట్టేందుకు వెళ్లి పనిముగించుకుని వచ్చే క్రమంలో చెల్లెలు విమలకు ఫోన్ చేసి ఆకలేస్తోంది. ఏదైనా తినేసి వస్తా. డబ్బులు కావాలని అడగ్గా ఫోన్ పేలో పంపించానని, కాసేపటికి ఫోన్ చేస్తే చనిపోయాడని తెలిసిందని చెల్లెలు విమల, తండ్రి వీరబాబు విలపిస్తున్నారు.

ఇంటర్‌లో నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక

☛ డీఐఈవో డా.జ్యోతుల రాంబాబు

ముఖాముఖి



విద్యార్థినికి పుస్తకాలు ఇస్తున్న డీఐఈవో రాంబాబు

పిఠాపురం, న్యూస్‌టుడే

'ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక సిద్ధం చేశాం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే 'సంకల్ప్' కార్యక్రమం అమలు చేస్తున్నాం. పాఠ్య, రాత పుస్తకాలకు ముందుగానే విద్యార్థులకు అందించాం. కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం.' అని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) డా.జ్యోతుల రాంబాబు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం అమలు చేయనున్న ప్రణాళికపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన పలు విషయాలు తెలియజేశారు.

● **10వేల మంది విద్యార్థులు..**

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14, ప్లస్ టూ కళాశాలలు 19 ఉన్నాయి. దాదాపు పదివేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు ఫిబ్రవరి 23న, మొదటి సంవత్సరం విద్యార్థులకు జూన్ 6న పాఠ్య, రాత పుస్తకాలు అందజేశాం. ప్రస్తుతం ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన సమాచారంతో 'సంకల్ప్' స్టడీ మెటీరియల్ ఇచ్చాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలి.

● **232 రోజుల బోధన**

గత ఏడాది కంటే ఈసారి పదిశాతం ప్రవేశాలు పెరిగాయి. 232 రోజుల పాటు విద్యా బోధన జరగనుంది. డిసెంబరు నాటికి సిలబస్ పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

● **అధ్యాపకుల కొరత లేదు**

జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత లేదు. రెగ్యులర్, కాంట్రాక్టు, అతిథి అధ్యాపకులతో విద్యార్థులకు బోధన చేస్తున్నాం. 200 మంది పైగా అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారు. వృత్తి విద్యార్థులకు కోర్సులు ఇంకా పెంచేందుకు ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అమలైంది. పీడీల కొరత ఉండటంతో ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే ఈ పోస్టు భర్తీ అవుతాయి.

● **మధ్యాహ్న భోజనం**

దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. రోజుకు 5,200 మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు. గతంలో భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేవారు. ఇప్పుడు కళాశాలలోనే భోజనం అందించడంతో హాజరు శాతం పెరిగింది.

● **లీప్, విద్యాశక్తికి ఎంపిక**

ఇంటర్ విద్య బలోపేతానికి ప్రభుత్వ కాకినాడ పీఆర్ జూనియర్ కళాశాలను లీప్ కళాశాలగా ప్రకటించింది. విద్యాశక్తి పథకానికి కాకినాడ పీఆర్, కిర్లంపూడి జూనియర్, కాకానాడ ఉమెన్స్ కళాశాలలు ఎంపికయ్యాయి. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు గంట పాటు ఆన్‌లైన్‌లో ఐఐటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేసేలా బోధన జరుగుతుంది. విద్యార్థులు ఆసక్తిగా చదువుతున్నారు.

నకిలీ పత్రాలు, సంతకం ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు



కన్నెకంటి శ్రీనివాసరావు

హైదరాబాద్, న్యూస్‌టుడే: యజమానుల సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ పత్రాలతో రూ.4.2 కోట్ల విలువచేసే రెండు ప్లాట్లు విక్రయించిన మోసగాడిని హైదరాబాద్‌లోని సూరారం పోలీసులు అరెస్టుచేశారు. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన బాల కృష్ణమూర్తి, మహాలక్ష్మిలకు బౌరంపేటలోని సతీష్‌సొసైటీలో రెండు ప్లాట్లు(600 చదరపు గజాలు) ఉన్నాయి. వాటిని ఇటీవల చింతల్‌కు చెందిన బేతి శ్రీనాథ్‌కు విక్రయించారు. రిజిస్ట్రేషన్ కోసం కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించుకోగా అప్పటికే ఆ స్థలం మరో వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ అయి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై కృష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కూకట్‌పల్లిలోని వివేకానందానగర్‌కు చెందిన కన్నెకంటి శ్రీనివాసరావు సంబంధిత ప్లాట్లకు మూడు నెలల కిందట ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో వ్యాలిడేషన్ పత్రాలు సృష్టించి తనకు పరిచయం ఉన్న వసుంధర అనే మహిళ పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ తరువాత శ్రీనివాస్‌బాబు అనే మరో వ్యక్తి సహాయంతో నెల రోజుల కిందట ప్లాట్లను అజయ్ అనే వ్యక్తికి విక్రయించాడు. గతంలో కూడా ఇతనిపై చేవెళ్ల, దుండిగల్, నార్సింగ్ ఠాణాల్లో కేసులున్నట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

టేకులపల్లి, న్యూస్‌టుడే : తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా రవాణా అవుతున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టేకులపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. టేకులపల్లి పోలీసులు ఆదివారం ఉదయం టేకులపల్లి పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా గొల్లప్రోలు గ్రామానికి చెందిన మోగిల్ల శివప్రసాద్ ట్రాలీ వాహనాన్ని రహదారి పక్కన అనుమానాస్పదంగా నిలిపి ఉంచడంతో పోలీసులు తనిఖీ చేశారు. అందులో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాల్వంచకు చెందిన సంపత్‌కుమార్, బోయిన నాగేంద్రబాబు, టేకులపల్లి మండలం కొప్పురాయికి చెందిన కల్యాణ్‌కుమార్ తక్కువ ధరకు ప్రజా పంపిణీ బియ్యం కొనుగోలు చేసి ట్రాలీ వాహనంలో కాకినాడ పంపిస్తున్నట్లుగా వెల్లడైంది. బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారమిచ్చామని ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో కారుతో బీభత్సం



మత్తులో వాహనం నడిపిన వ్యక్తి



ప్రమాదానికి గురైన కారు, ద్విచక్రవాహనం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కారును నడిపి.. నాలుగు ద్విచక్ర వాహనాలు, మరో కారును ఢీకొన్న సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి కూతవేటు దూరంలో జరిగింది. ఈ ప్రమాదంలో యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. కాకినాడ జిల్లా తునికి చెందిన పడాల సాయి, మామిడి రమేష్, కిరణ్.. ఆదివారం గూడెంకొత్తవీధి మండలం ధారకొండ ధారాలమ్మను దర్శించుకునేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురు మద్యం తాగారు. కారు అతివేగంగా నడిపారు. జాతీయ రహదారిలో అంతర్ల వాహనాల సర్వీసింగ్ సెంటర్ వద్ద కారు అదుపు తప్పింది. సర్వీసింగ్ సెంటర్ బయట రహదారి పక్కనున్న నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక కారును కారుతో బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బయట నిల్చున్న రమేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనలో ద్విచక్రవాహనాలు, కారు నుజ్జయ్యాయి. మద్యం తాగి నడిపిన కారు కూడా దెబ్బతింది. ప్రమాద సమయంలో బయట ఎవరూ లేకపోవడం, జాతీయ రహదారిపై ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	16,000
పాతకాయ: గండేరా	23,500
గటగట	21,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	20,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-21,000
కొత్త (పచ్చి) కాయ	20,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	257-00

వెనుక నుంచి వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

☛ ఘటనలో రెండు గేదెలు సైతం..
☛ వాహనం వదిలి డ్రైవర్ పరారీ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో ఆదివారం రాత్రి మేపుకుని పశువులతో ఇంటికొస్తుండగా వెనకనుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి, రెండు గేదెలు మృతిచెందాయి. మరొకటి ప్రమాదకర పరిస్థితిలో ఉంది. వివరాలివీ. సోమవరం గ్రామానికి చెందిన నమ్మి తాతారావు, తనయుడు శివయ్య రోజూ కూలీపనులు చేసుకుంటూ ఆరు పాడిగేదెలను మేపుతున్నారు. రోజూ మాదిరిగానే ఆదివారం పశువులను సోమవరం ఎత్తిపోతల పథకం సమీపంలోని పొలాల్లో మేపి రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటికి తండ్రీ, కొడుకు పశువులను తోలుకువస్తుండగా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామం వైపు నుంచి వస్తున్న వాహనం అతివేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో నమ్మి తాతారావు (60), రెండు పాడిగేదెలు ఘటనాస్థలిలోనే మృతి చెందాయి. మరొకటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. శివయ్య కొద్ది దూరంలో వెనక నడిచివస్తుండడంతో అతనికి ప్రమాదం తప్పింది. తాతారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాద స్థలంలో వ్యాన్‌ను వదిలిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు.

కాకినాడ

దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం మేలు

రమణయ్యపేట (కరప), న్యూస్‌టుడే: దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం మేలని ఆయుర్వేద వైద్యురాలు డా.రమ్య అన్నారు. కాకినాడ గ్రామీణ మండలం రమణయ్యపేట బోటు క్లబ్ ఉద్యానంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేదం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రజలందరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎ.రత్నప్రసాద్, డా.దాసరి శ్రీధర్, కె.శ్రీరామరాజు, రామకృష్ణరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఇంద్రపాలెం (కరప), న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఇంద్రపాలెంలో నిర్వహించనున్నట్లు కమిటీ ఛైర్‌పర్సన్ మాసుమేను మంగ ఆదివారం తెలిపారు. ఛైర్‌పర్సన్‌గా తనతో పాటు వైస్ ఛైర్మన్‌గా ఎన్ఎస్ఎస్ రామయ్య, సభ్యులుగా బి.సూర్యవతి, జి.రాజేశ్వరి, ఆర్.సత్యసుజన్య, పి.బులివీర్రాజు, ఎన్.ఈశ్వరరావు, ఎం.రామకృష్ణ, పి.శివకుమార్, డి.వెంకటరమణ, జి.వెంకటలక్ష్మి, జి.విజయలక్ష్మి, ఈ.చినవెంకటయ్య, ఎల్.జ్యోతి, బి.నవీన్‌కుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వ్యర్థాలు తరలించరే



బాలాజీచెరువు, న్యూస్‌టుడే: స్థానిక 50వ డివిజన్ కొత్త గ్రిగోలుపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)కు వెళ్లే దారిలో వ్యర్థాలను రోజుల తరబడి తరలించడం లేదు. రహదారి చెంతనే వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమలు విజృంభిస్తున్నా.. పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. యూపీహెచ్‌సీకి వెళ్లేదారిలో ఈ దుస్థితిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా వ్యర్థాలను తరలించి, శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాగు చేయండి.. ఆహ్లాదం పంచండి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే:

నగరంలోని పలు ప్రాంతాల్లోని నగరపాలక సంస్థ ఉద్యానాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే అధ్యక్షతన పార్కుల అభివృద్ధిపై అధికారులతో సమావేశం జరిగింది. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనిపై చర్యలు వేగవంతం చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



సిద్ధార్థనగర్‌లో పార్కు పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఇలా..

- నగరంలోని 50 డివిజన్లలో చిన్నా పెద్ద కలిపి సుమారు 70 నగరపాలకసంస్థ ఉద్యానాలు ఉన్నాయి. వాటిలో సుమారు 10 చోట్ల మాత్రం అన్ని వసతులు ఉన్నాయి. మిగిలిన వాటిని సమస్యలు చుట్టుముట్టాయి.
- స్థానిక సిద్ధార్థనగర్‌లోని ఓ వీధిలోని నగరపాలకసంస్థ పార్కు పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉంది. కనీస సదుపాయాలు, వాకింగ్ ట్రాక్ కూడా లేదు.
- శాంతినగర్‌లోని నెహ్రూ పార్కులో క్రీడా పరికరాలు లేవు. పిల్లలు ఆటలు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.
- సంజీవిరావు ఉద్యానం మైదానంలా ఉంది తప్ప ఎటువంటి సదుపాయాలు లేదు. వ్యాయామ పరికరాలు, ఆట వస్తువులు, విద్యుత్తుదీపాలు, మొక్కలు తదితర కనీస వసతులు కూడా లేకపోవడంతో ఆ ప్రాంత వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- స్థానిక పల్లంరాజునగర్‌లోని ఉద్యానాలు సైతం సమస్యలతో సతమతమవుతున్నాయి. దీంతో ఇక్కడనుంచి దూర ప్రాంతాల పార్కులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- అయోధ్యనగర్, సాంబమూర్తినగర్, గౌతమినగర్, సంతచెరువు, వెంకట్‌నగర్, జయేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో పార్కులు అలానే ఉన్నాయి.
- సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, క్రీడా పరికరాలు, కనీస వసతులు కల్పించాలని నగరవాసులు కోరుతున్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



వాహనదారులతో ముఖం కడిగిస్తున్న సీఐ రమేష్ సిబ్బంది

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: డ్రైవింగ్ చేసే వాహనదారులు నిద్ర మత్తులో ప్రమాదాలకు గురికాకుండా రహదారి భద్రతా నియమాలు పాటించాలని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్ అన్నారు. ఆదివారం తెల్లవారుజామున కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్, పెద్దాపురం ఎస్సై, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులతో ముఖం కడిగించి, విశ్రాంతి తీసుకుని వెళ్లాలని సూచించారు. సీఐ మాట్లాడుతూ నిద్రమత్తులో, అతివేగంగా వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

ఉద్యోగ మేళా నేడు

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలో వివిధ పోస్టులకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని కోరారు.

అమ్మవారికి వెండి చీర



సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని 36వ డివిజన్ దుర్గినగర్‌లోని విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలోని లలిత అమ్మవారికి భక్తుల సహకారంతో సేకరించిన దాదాపు రూ.5 లక్షలతో 5 కిలోల వెండి చీర(కవచం) తయారు చేయించామని ఆలయ కమిటీ కార్యదర్శి నల్లూరి శ్రీనివాస్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు అమలకంటి సూర్యప్రకాశ్, నల్లమిల్లి వెంకటరెడ్డి, మండపల్లి వెంకన్నబాబు, చిల్లా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత శుభ్రత.. అందరి బాధ్యత

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: సముద్ర తీర ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అల్ ఈజ్ వెల్ సంస్థ అధ్యక్షుడు కిశోర్‌కుమార్ అన్నారు. 'సమాజం కోసం మూడు గంటలు' కార్యక్రమంలో భాగంగా జాతీయ సముద్ర తీర దినోత్సవం సందర్భంగా కాకినాడ ఎన్టీఆర్ బీచ్ వద్ద ఏపీఎస్‌పీ, రోటరీ క్లబ్ సభ్యులు, పాఠశాల విద్యార్థులు ఆదివారం ఉదయం శ్రమదానం నిర్వహించారు. దంత వైద్య నిపుణులు డా.అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్ర జీవుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ప్రజలు బీచ్‌కి వెళ్లినప్పుడు వెంట తీసుకొచ్చిన బాటిళ్లు, కవర్లు వంటివి డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. సంస్థ సభ్యులు డా.రాజకుమార్, టీవీవీఎస్ఎన్ రెడ్డి, డా.రవివర్మ, విక్రమ్, రాజేంద్ర, శ్రీనివాసు, వెంకటనారాయణ, కె.నాగభూషణం, జెన్ గ్రీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యలూ పెద్దవే..

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: పైన పటారం.. లోన లొటారం.. అన్న చందాన ఉంది కాకినాడ నగరం నడిబొడ్డున ఉన్న పెద్ద మార్కెట్ దుస్థితి. పేరు ఆర్భాటమే తప్ప లోపల అడుగు పెడితే కళావిహీనంగా, దుర్భరంగా ఉంది. ఈ మార్కెట్‌లో ముందు వైపు ఆకుకూరలు, కూరగాయల దుకాణాలు నిర్వహిస్తుండగా.. వెనుక వైపు చేపలు, మాంసం దుకాణాలు ఉన్నాయి. కాలువలు చెత్తాచెదారం, వ్యర్థాలతో మూసుకుపోయాయి. ఇక మురుగు తొలగించేందుకు ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిపై ఎలాంటి మూతలు లేకపోవడంతో మార్కెట్‌కు వచ్చే వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక చిన్నపాటి వర్షానికే మొత్తం ముంపునకు గురవుతోంది. లోపలి ప్రాంతం పల్లంగా ఉండటం, నీరు వెళ్లేందుకు సరైన అవుట్‌లెట్ లేకపోవడంతో గంటల తరబడి నీరు నిలిచిపోయి అటు వ్యాపారులు, ఇటు మార్కెట్‌కు వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

అంతా ఆక్రమణలే..

ఈ ప్రాంతమంతా ఆక్రమణలతో కుంచించుకుపోయింది. ప్రధాన మార్గంలో ఇరువైపులా కొందరు దుకాణదారులు ముందుకు చొచ్చుకొచ్చి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇక లోపలికి వెళ్లే మార్గంలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. వెనుక వైపు మార్గంలో కొందరు దారికి అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఇక్కడి సమస్యలు పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.



కాలువలపై వ్యర్థాలు ఇలా..



గొడారిగుంట పోలింగ్ బూత్‌లో ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న అర్బన్ ఈఆర్‌వో సుధాకర్

గడువులోగా విచారణ పూర్తిచేయండి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీచేసిన నోటీసులపై గడువులోగా విచారణలు పూర్తి చేయాలని నియోజకవర్గ ఈఆర్‌వో కేజే సుధాకర్ ఆదేశించారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ బూత్‌లలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. నోటీసులు ఇచ్చిన ఓటర్లు సమర్పించిన ఆధారాలను, రసీదు, ధ్రువీకరణలను బీఎల్‌వోలు భద్రపరచాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: జిల్లాలో నీట్ పీజీ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎస్పీ కిషోర్‌కుమార్ వివిధ కేంద్రాలను సందర్శించి సూచనలు చేశారు.

25 ద్విచక్రవాహనాల స్వాధీనం



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న కాకినాడ పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్

మసీదు సెంటర్: ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రజల భద్రతకు నిరంతరం కృషిచేస్తామని కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఎస్సీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఏదైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయా, గంజాయి ఇతర మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన అంశాలు ఉన్నాయా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. అనంతరం గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతిజ్ఞచేశారు. సుహృద్భావ వాతావరణం ఏర్పడేలా ప్రజలతో పోలీసు అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు, ఈగల్ టీం సభ్యులు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మసీదు సెంటర్: రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు తెలిపారు. వన్‌టౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు, భూ సెటిల్‌మెంట్లకు, జూదం, దౌర్జన్యాలు, ఇతర గొడవలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..



కాకినాడ జగన్నాథపురం నుంచి ఏటిమొగకు వెళ్లే రహదారిలో మత్స్యశాఖ కార్యాలయం మలుపు వద్ద ఓ విద్యుత్తు స్తంభంపై మొక్క జాతి తీగలు ఎగబాకాయి. వీధి దీపంతోపాటు విద్యుత్తు తీగలకు చుట్టుకోవడంతో వర్షాల సమయంలో ప్రమాదానికి ఆస్కారముందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పూడికతీత అంటే ఇదేనా?



ఈ ఏడాది మురుగుకాలువల్లో పూడికతీత పనులు మమ అనిపించారు. రాజాట్యాంకు పార్కు ప్రధాన ద్వారం నుంచి టౌన్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో డ్రెయిన్ ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది. చిన్నపాటి వర్షం వచ్చినా.. ఈ డ్రెయిన్ పారక నీరు రహదారిపైకి వచ్చి టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారికి, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పూడిక తొలగించి, మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, బాలాజీచెరువు

చూసుకోకుంటే చింతే..



కాకినాడ, బాలాజీచెరువు నుంచి సాలిపేట వెళ్లే ప్రధాన రహదారి కూడలి వద్ద కాలువపై స్లాబురాయికి రంధ్రం పడి ప్రమాదకరంగా ఉంది. దాంతో రోడ్డు మధ్యలో స్లాబురాయి ధ్వంసం అవడంతో ఆ రహదారి గుండా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

పొంచి ఉన్న ప్రమాదం



జగన్నాథపురం (తూరంగి పంచాయతీ) ఈశ్వర కాలనీలో గుడి నుంచి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో నియంత్రిక వద్ద ఫ్యూజుబాక్సు వద్ద తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. స్తంభం రోడ్డుపైనే ఏర్పాటు చేయడంతో పాటు, తీగలు బయటకు ఉండడంతో వాహనదారులు కొంచెం పక్కకు వెళ్లినా తగిలేలా ఉన్నాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, జగన్నాథపురం

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా వాసన్ ఐ కేర్ కాకినాడ బ్రాంచ్ మేనేజర్ స్వామి వందనం ఆధ్వర్యంలో ఆదివారం నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. డా.శ్రీవిద్య, డా.పి.శుభారాణి, డా.వంశీకృష్ణ, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు, సీనియర్ అడ్వకేట్ పృథ్వీరాజ్, డా.మోనిక, డా.ప్రశోబ్ మాట్లాడుతూ మరణానంతరం ఒకరి నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగు నింపవచ్చన్నారు. ర్యాలీ అనంతరం భానుగుడి కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. వైద్యులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



భానుగుడి కూడలి వద్ద మానవహారం

సాంబమూర్తినగర్, గాంధీనగర్: నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బాదం బాలకృష్ణ 'ఐ' బ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కాకినాడ పీఆర్ కళాశాలలో వాకింగ్ ట్రాక్ వద్ద నేత్రదాన ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఐ బ్యాంక్ ఛైర్మన్ శీమకుర్తి పాపారావు, కార్యదర్శి పైడా సోమేశ్వరరావు, ట్రస్టీ బాదం చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐ బ్యాంకు ప్రతినిధులు

కార్పొరేషన్‌లో నేడు పీజీఆర్ఎస్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆరఎస్)ను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని డివిజన్ల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించేందుకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కనకదుర్గ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పిఠాపురం: సంస్కృతి, సంప్రదాయాలకు దేవాలయాలు పునాదులు వంటివని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా వెంకటేశ్వరరావు మణికుమార్ అన్నారు. ఆదివారం పిఠాపురంలోని కాకినాడ రోడ్డులో నూతనంగా నిర్మించే కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆ ప్రాంతం ఆలయ సభ్యుడు విజయేంద్ర ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ప్రత్యేక హోమం, పూజలు చేశారు. దేవాలయాలు మానసిక వికాస కేంద్రాలుగా ఉంటాయని, చిన్నారుల్లో భక్తి భావన పెరుగుతుందన్నారు.

మిషన్ వాత్సల్య పథకంతో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు

రమణయ్యపేట(కరప), న్యూస్‌టుడే: ఆదరణ కరవైన చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు సూచించారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలో ఆదివారం ఆయన అడబాల ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలబాలికలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి ఏడాది రూ.48వేలు చొప్పున అందుతుందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పి.ధర్మచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్లు అందజేస్తున్న రీజనల్ మేనేజర్ కృష్ణ

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

సాంబమూర్తినగర్, గాంధీనగర్: డిజిటల్ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని స్టేట్‌బ్యాంకు కాకినాడ రీజనల్ మేనేజర్ ఎంవీవీఎం కృష్ణ అన్నారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ 3వ బెటాలియన్ ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు 13 కంప్యూటర్లను అందజేశారు. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ కె.నవీన్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, గంగరాజు, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతికూల ఆలోచనలకు స్వస్తి పలకాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ కాదా వెంకటరమణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి మనిషి జీవితంలో ప్రతికూల ఆలోచనలకు స్వస్తి పలకాలని రేడియోలజిస్టు డాక్టర్ కాదా వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక ఎస్.అచ్యుతాపురంలోని అంబేడ్కర్-బుద్ధవిహార్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనేక అంశాలు మానవ జీవితంలో ప్రతికూల ఆలోచనలు సృష్టిస్తున్నాయన్నారు. బౌద్ధంలోని సత్యాల ద్వారానే కోరికలు అధిగమించి మనసును అదుపులో పెట్టుకోగలమని చెప్పారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ మాజీ వీసీ కె.బాబ్జీ, పి.శ్రీహరి, జి.బాలయోగి, ఎన్.సరోజిని, ఏడుకొండలు, పి.సుధీర్, జె.కుమారశేఖర్, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాన్ని ఇలా ఆపేయగలరా?

జగన్నాథపురం (కాకినాడ) న్యూస్‌టుడే: జగన్నాథపురం (కొవ్వూరు పంచాయతీ) తారకరామనగర్ (మేడ లైన్) దగ్గర ఉప్పుటేరు కాలువపై ఉన్న చిన్న వంతెన ప్రమాదకరంగా మారింది. దీనికి రెయిలింగ్ కింద వేసిన సిమెంటు స్తంభాలు సగానికి పైగా విరిగిపోతే వాటికి మరమ్మతులు చేశారు. కొద్దిరోజులకే ఇప్పుడు మరోచోట విరిగిపోయి ఏ క్షణమైనా పడిపోయేలా ఉంది. దీనికి విద్యుత్తు కట్టి వదిలేశారు. పొరపాటున ఏ వాహనమైనా అదుపుతప్పితే నేరుగా ఉప్పుటేరులో పడిపోవాల్సిందే. ఉన్నతాధికారులు ప్రమాదాల నివారణకు శాశ్వతచర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యుత్తుతీగలతో కట్టిన వంతెన పక్కగోడలు

గోడు వినండి.. చెత్త తొలగించండి

● అయిదు డివిజన్ల వాసులకు తప్పని ఇక్కట్లు

న్యూస్‌టుడే, బాలాజీచెరువు

నగరపాలక సంస్థ, 12వ శానిటేషన్ సర్కిల్ పరిధిలోని 38,38,41,42,43 డివిజన్లలో వేల మంది ఆవాసముంటున్నారు. ఇక్కడ ఇళ్ల నుంచి సేకరించే వ్యర్థాలను డంపరు బిన్నుల్లో నిల్వ చేసి, గంటల వ్యవధిలో డంపింగ్‌యార్డుకు తరలించడానికి 2019లో కాంపాక్టర్ వాహనాన్ని కేటాయించారు. చాలా కాలం ఈ వాహనం ద్వారా రోజూ వ్యర్థాలను తరలించేవారు. 2024, డిసెంబరు నుంచిడిది మరమ్మతులకు గురైంది. దీని బాగు చేసి వినియోగించిన 15 రోజుల వ్యవధిలోనే మళ్లీ మూలకు చేరింది. దీంతో మరో శానిటేషన్ సర్కిల్‌కు చెందిన కాంపాక్టర్‌ను ఇక్కడకు పంపి, చెత్తను అతికష్టం మీద యార్డుకు తరలించేవారు. ఈ మధ్యకాలంలో ఈ వాహనం సక్రమంగా ఇక్కడకు రావడం లేదు. రెండు రోజులకు ఒకసారి వ్యర్థాలను తరలిస్తున్నారు. దీంతో వీధుల్లోని డంపరు బిన్నుల్లో చెత్త రహదారిపైకి చేరడమే కాకుండా తీవ్రమైన దుర్వాసన, దోమల విజృంభనతో వేల మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 12వ సర్కిల్‌కు కాంపాక్టర్ వాహనం కొత్తది కేటాయించాలని, కనీసం పాత వాహనాన్ని బాగు చేసి వినియోగంలోకి తెచ్చి.. రోజూ వ్యర్థాలు తరలించేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మరమ్మతులకు గురైన కాంపాక్టర్ వాహనం

అన్ని వర్గాల అభ్యున్నతే కూటమి లక్ష్యం

కరప: అన్నివర్గాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పేర్కొన్నారు. కరప మండలం నడకుదురులో ఆదివారం వారు 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: పిఠాపురం కోటసత్తెమ్మ తల్లి ఆలయం సమీపంలోని పార్కు స్థలం, చుట్టు పక్కల తుప్పలు ఆవరించి ఉన్నాయి. – రమణ, స్థానికుడు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు తెలియజేయగా శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: గొల్లప్రోలు ఎస్సీపేట శివారులో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – స్థానికులు

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: కరప మండలం నడకుదురులోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గృహాల్లో వాడకం నీరు రోడ్డుపైకి వస్తోంది. దుర్వాసన వస్తోంది. – శ్రీనివాసరావు

పరిష్కారం: గ్రామ ప్రత్యేకాధికారి వెంకట శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా వాడకం నీరు రహదారిపై వదిలేయకుండా స్థానికులకు అవగాహన కల్పించారు. – న్యూస్‌టుడే, కరప.

సమస్య: స్థానిక శివాలయంవీధిలో రహదారిపై చెత్తకుప్పలు ఉన్నాయి. వాటిని తొలగించడానికి చర్యలు చేపట్టాలి. – ప్రసాద్

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు చెప్పగా సిబ్బంది పంపి చెత్తను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి మిగులు జలాలు విడుదలచేసే కాలువల్లో పరిశ్రమల వ్యర్థ రసాయనాలు కలిసి కలుషితం అవుతున్నాయి. తీవ్ర దుర్వాసన వస్తోంది. – రాందాస్, వెంకట్‌నగర్(కాకినాడ)

సమాధానం: ఈ సమస్యపై ఫిర్యాదులేమీ రాలేదు. నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతాం. – సూర్యకళ, పీసీఈ ఈఈ, కాకినాడ

పొదల తొలగింపు

స్పందనకు వందనం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు రాజు చెరువు దగ్గర ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ పెరిగిన పొదలను తొలగించే పనులు ఆదివారం చేపట్టారు. ఈనెల 11న 'ఈనాడు'లో 'నియంత్రిక కనిపించకుండా' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి విద్యుత్తు పంపిణీ సంస్థ అధికారులు స్పందించారు. నియంత్రిక చుట్టూ శుభ్రం చేయిచారు. ఏఈ రామచంద్రరావు పర్యవేక్షించారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ సేవలు ప్రశంసనీయం

కాజులూరు: ఉప ముఖ్యమంత్రి సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రవాస భారతీయుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి ఏర్పాటుచేసిన మెగా రక్తదాన, వైద్య, కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

నేడు పీజీఆర్ఎస్

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ జరుగుతుందని పీడీ డా. శివరామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారన్నారు. గతంలో ఇచ్చిన వారు అవసరం లేదని పేర్కొన్నారు.

'పురం.. ఎన్నికలు ప్రత్యక్షం!'

• కసరత్తు ప్రారంభించిన అధికారులు
• సిద్ధమవుతున్న పార్టీలు



కొత్త వార్డులకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న కమిషనర్ దివిజ సంపతి

వార్డుల విభజన తీరు..

పట్టణం	గతంలో వార్డులు	ప్రస్తుతం ఇలా..
పిఠాపురం	30	36
పెద్దాపురం	29	32
సామర్లకోట	31	36
గొల్లప్రోలు	20	23

ముసాయిదా జాబితా ప్రకారం..

పురపాలిక	బూత్‌లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
పిఠాపురం	52	18,817	20,220	1	39,038
గొల్లప్రోలు	22	9,458	9,526	--	18,984
పెద్దాపురం	45	17,828	19,746	5	37,579
సామర్లకోట	44	18,660	20,206	1	38,867

పిఠాపురం, గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, గొల్లప్రోలు పురపాలికల్లో పాలకవర్గాల పదవీ కాలం ఏప్రిల్ 17న ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వార్డుల పునర్విభజనకు అవకాశం కల్పించింది. మే 17న ఇందుకు సంబంధించిన ముసాయిదా జాబితా ప్రచురించారు. పిఠాపురంలో విభజన సరిగా జరగలేదని కోర్టును ఆశ్రయించారు. ఇదే పరిస్థితి ఇతర పురపాలికల్లోనూ ఉండడంతో అప్పట్లో ఈ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేశారు. వార్డుల పునర్విభజనపై కోర్టు కేసుల పరిష్కారం, కేసుల్లేని చోట్ల జాబితాలు సిద్ధం చేయాలని సర్కారు ఆదేశించడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. కేసులున్నా పురపాలిక మినహా, ఇతర ప్రాంతాల్లో వార్డు విభజన గెజిట్ నోటీసు విడుదల చేశారు. వచ్చేనెల 3న తుది జాబితా విడుదలకు కసరత్తు మొదలైంది. తరువాత రిజర్వేషన్లు గుర్తింపుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల సర్వే నిర్వహిస్తారు. అదే సమయంలో పోలింగ్ కేంద్రాలు పెంపుపైనా దృష్టి సారిస్తారు. బీసీ రిజర్వేషన్ పెంచడంతో ఆ సామాజిక వర్గాలకు ఎక్కువగా సీట్లు కేటాయించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మారిన స్వరూపం

పెరిగిన వార్డుల కారణంగా వాటి స్వరూపాలు, సామాజిక వర్గాల ఓటర్ల బలాబలాలు మారిపోయాయి. దాంతో ఛైర్‌పర్సన్, వార్డుల వారీగా కౌన్సిలర్ల స్థానాల రిజర్వేషన్ల ఖరారుపై చర్చలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికల నిర్వహణ చట్టం తీసుకురాగా, దానికి గవర్నర్ ఆమోదముద్ర వేశారు. గతంలో కౌన్సిలర్లంతా కలిసి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్లను ఎన్నుకునేవారు. అసంతృప్తి ఉంటే 4 ఏళ్ల తరువాత పదవి నుంచి తొలగించే అవకాశం ఉండేది. ఈసారి ప్రత్యక్ష పద్ధతిలో గెలిస్తే అయిదేళ్ల పాటు సేవలు అందించే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం వైస్ ఛైర్‌పర్సన్ పదవులు రెండేసి తీసుకొస్తే, దాన్ని కుదించి ఒక్కరే వైస్‌ఛైర్మన్ ఉండేలా సవరణ చేశారు. దీంతో అన్ని పార్టీలు తమ అభ్యర్థులను బలపరిచేందుకు సమావేశాలు సైతం ప్రారంభించారు.

మాదక ద్రవ్యాలతో ముప్పే



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

పెద్దాపురం: గంజాయి వంటి మాదక ద్రవ్యాల జోలికి ఎవరూ వెళ్లొద్దని సీఐ శ్రీనివాస్ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఆపరేషన్ వజ్ర ప్రహార్‌లో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్, కొండయ్యపేట, క్రిస్టియన్‌పేట, జగనన్నకాలనీలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై పాపారావు, అంకబాబు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకంతో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు

రమణయ్యపేట(కరప), న్యూస్‌టుడే: ఆదరణ కరవైన చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు సూచించారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలో ఆదివారం ఆయన అడబాల ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులను కోల్పోయిన బాలబాలికలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి ఏడాది రూ. 48వేలు చొప్పున అందుతుందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పి. ధర్మచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలుస్తాం



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, న్యూస్‌టుడే: అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం తరఫున అండగా నిలుస్తామని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఆదివారం పిఠాపురం మండలం పి. దొంతమూరులో గ్యాస్ లీకై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. వర్మాస్ కావ్య ఫౌండేషన్ తరఫున రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు ఎస్వీఎస్ఎన్ రవి, బండి సత్తిబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠాపన



గొల్లప్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలు పాత నంది కూడలిలో శ్రీకృషుడి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. బీసీవై నియోజకవర్గ ఇన్‌ఛార్జి శీరం శ్రీను రూ. 10,116 విరాళంగా ఆలయకమిటీ ప్రతినిధులకు అందజేశారు. యాదవ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పోటీల్లో ప్రతిభ



దక్షనందన్

పిఠాపురం, న్యూస్‌టుడే: కాకినాడలో సంస్కార భారతి ఆధ్వర్యంలో వ్యాస భవనంలో ఆదివారం జిల్లాస్థాయి శ్రీకృష్ణ వేషధారణ పోటీలు జరిగాయి. జూనియర్స్ విభాగంలో పిఠాపురానికి చెందిన పెద్దింటి శ్రీదక్ష్ నందన్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాలుడు చదువుతున్న ఆదిత్య కిండర్ వండర్ ప్రిన్సిపల్ రేవతి బాలుడిని అభినందించారు. తల్లిదండ్రులు విజయ జనార్దనాచార్యులు, జయశ్రీ పాల్గొన్నారు

ఒకచోట అరికడితే.. మరోచోట లీకేజీ



సామర్లకోట రహదారి దర్గా వద్ద లీకవుతున్న పైపులైన్

పెద్దాపురం: పెద్దాపురం పట్టణానికి వచ్చే గోదావరి జలాలు పైపులైన్ల లీకేజీలతోనే చాలా వరకు వృథా అవుతున్నాయి. సామర్లకోట నుంచి కాకినాడ రహదారిలోని పెద్దాపురం రక్షిత నీటి సరఫరా పథకం వద్ద జలాలు ఆలం, పటిక, క్లోరిన్‌తో శుద్ధిచేశాక పట్టణానికి సుమారు ఏడు కిలోమీటర్ల పొడవున పైపులైన్ ద్వారా వస్తాయి. ఇక్కడి నుంచి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుంది. సామర్లకోటలోని విటికర్ పాఠశాల, దర్గా వద్ద, జగ్గంపేట రహదారిలోని విద్యుత్తు ఉపకేంద్రం వద్ద పైపులైన్ లీకేజీతో నీరు పోతోంది. ఇటీవల విటికర్ వద్ద మరమ్మతులు చేపట్టారు. అది ఇంకా పూర్తికాకుండానే కాస్త ముందు దర్గా వద్ద, జగ్గంపేట రహదారిలో రెండు చోట్ల లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. అసలే రోజుకు 4.5 ఎంఎల్‌డీ గోదావరి జలాలు వస్తుంటే.. అందులో 0.50 ఎంఎల్‌డీ వరకు వృథా అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. వృథాను పూర్తిగా అరికట్టలేని మరమ్మతులతో ప్రజాధనం దుర్వినియోగమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. నిపుణులతో శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..

పెద్దాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిలో విటికర్ పాఠశాల వద్ద పడిన లీకేజీల నియంత్రణ పనులు జరుగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో కూడా నీటి వృథాను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటాం. – శ్రీకాంత్‌రెడ్డి, కమిషనర్

ఆదమరిస్తే.. ప్రమాదమే



పెద్దాపురంలో తాడితోట మానోజీచెరువు వద్ద విద్యుత్తు ఫ్యూజు పెట్టెకు మూత సరిగా లేదు. ఈ ప్రాంతంలో తాపీ వర్కర్స్ యూనియన్ భవనం ఉంది. అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఏఈ సుబ్బారావు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

పారదర్శకంగా ఓటరు జాబితా



వివరాలు తెలుసుకుంటున్న కాంతిలాల్ దండే

వాకలపూడి (కరప), న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి పౌరుడికి ఓటుహక్కు కల్పించడంతో పాటు ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు సిబ్బంది కృషి చేయాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సూచించారు. కాకినాడ గ్రామీణం వాకలపూడి పంచాయతీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి వార్డుల విభజన, బీసీ, ఎస్టీ, ఎస్సీ ఓటర్ల జాబితా ఏవిధంగా తయారు చేశారో అడిగి తెలుసుకున్నారు. డీపీవో రవికుమార్, డీడీవో వాసుదేవరావు, ఎంపీడీవో పి. సతీష్, కార్యదర్శి పి. పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు పట్టణం, మండలంలోని పోలింగ్‌బూత్‌లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 18 ఏళ్లు నిండివారు ఓటరుగా నమోదు అయ్యేందుకు, పేర్లు, చిరునామా మార్పునకు దరఖాస్తులు బీఎల్‌వోలు స్వీకరించారు. కమిషనర్ దివిజ సంపతి, తహసీల్దార్ వెంకటభాస్కర్ తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

సాంబమూర్తినగర్, గాంధీనగర్: డిజిటల్ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని స్టేట్‌బ్యాంకు కాకినాడ రీజనల్ మేనేజర్ ఎంవీవీఎం కృష్ణ అన్నారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ 3వ బెటాలియన్ ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు 13 కంప్యూటర్లను అందజేశారు. ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ కె. నవీన్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, గంగరాజు, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.



కంప్యూటర్లు అందజేస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కృష్ణ

మురుగు కాలువల్లేవ్!



పిఠాపురం పాదగయ క్షేత్రం దగ్గర దత్తనగర్ కాలనీలో పదేళ్లుగా ఇక్కడ నివాస సముదాయాలు వెలుస్తున్నాయి. సీసీ రోడ్లు నిర్మించినా డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు చుట్టుపక్కల ఖాళీ స్థలాల్లో నిలుస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏఈ అబిలాష్‌కు తెలియజేయగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

కనకదుర్గ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో విశ్వహైందవ పరిషత్ సభ్యులు

పిఠాపురం, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలకు దేవాలయాలు పునాదులు వంటివని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా వెంకటేశ్వరరావు మణికుమార్ అన్నారు. ఆదివారం పిఠాపురంలోని కాకినాడ రోడ్డులో నూతనంగా నిర్మించే కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆ ప్రాంతం ఆలయ సభ్యుడు విజయేంద్ర ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమం, పూజలు చేశారు. దేవాలయాలు మానసిక వికాస కేంద్రాలుగా దేవాలయాలు ఉంటాయని, చిన్నారుల్లో భక్తి భావన పెరుగుతుందన్నారు.

లింక్ డాక్యుమెంట్ పోయినది

నేను కొంగి ఆర్యవేణి, W/o కొంగి చిన్నబాబు, ఆధార్ నెం: 993182979315, డోర్ నెం: 18-77, SC పేట, గొల్లప్రోలు మండలం, గొల్లప్రోలు గ్రామం, కాకినాడ జిల్లా వాస్తవ్యురాలను తెలియజేయునది ఏమనగా, నా యొక్క కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం, గొల్లప్రోలు నగర పంచాయితీలో చేరిన పిఠాపురం సబ్ రిజిస్ట్రీ గొల్లప్రోలు తాలూకా సర్వే నెం: 555/3 పాత అసెస్మెంట్ నెం: 2302, పాత డోర్ నెం: 18-77, కొత్త అసెస్మెంట్ నెం: 1138001050, కొత్త డోర్ నెం: 4-1-57లో గల ఖాళీస్థలం యొక్క సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ నెం: 360/2022, సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం: 2368/1984, ది. 2-8-2026న గొల్లప్రోలు మెయిన్‌రోడ్‌లో బైక్‌పై వెళ్ళుచుండగా పడిపోయినది. ఎవరికైనా దొరికినయెడల క్రింది నంబరుకు తెలియజేయగలరు.

Cell: 8106635779

పోటీ పరీక్షల్లో రాణించాలి

కరప, న్యూస్‌టుడే: పోటీ పరీక్షల్లో రాణించేలా స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న పోటీ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వేళంగి గ్రాడ్యుయేట్స్ ప్రతినిధులు యర్రా విక్రమ్, దేగల శ్రీనివాస్ సూచించారు. కరపమండలం వేళంగిలో ఆదివారం వీజీవై ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్షలు నిర్వహించి విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించేందుకు ఇలాంటి పరీక్షలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచి పోటీ పరీక్షలలో పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో దూళ్ల వీరేంద్ర, ఖండవిల్లి గుణ, చప్పిడి నరసింహమూర్తి, షేక్ లాలిబాబు, పట్టా రాజశేఖర్, సిద్ధబత్తుల అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు, బహుమతులు అందుకున్న వారితో ప్రతినిధులు



విశాఖ గర్జనకు వెళ్తున్న ఉపాధ్యాయులు

అసత్య ప్రచారం తగదు

పిఠాపురం, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీపై వైకాపా అసత్య ప్రచారం సాగిస్తుందని ఉపాధ్యాయులు మండిపడ్డారు. ఆదివారం ఎంపీపీఎస్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించి 'అసత్యాలపై ఆత్మగౌరవ గర్జన' ర్యాలీకి పిఠాపురం ప్రాంత ఉపాధ్యాయులు బస్సులో వెళ్లారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తే అవమానిస్తున్నారన్నారు.

చకచకా తాగునీటి ట్యాంకుల నిర్మాణం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులో నెలకొన్న తాగునీటి ఎద్దడి పరిష్కారానికి నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకుల పనులు వేగంగా సాగుతున్నాయి. ఎస్సీపేట, కొత్తపేట, కొత్తకాలనీ, మార్కండేయపురం శివారులో ఈ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ఆయా పనులను ఆదివారం ప్రజారోగ్యశాఖ డీఈఈ బ్రహ్మతేజ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని చెప్పారు. ఈ పనులకు ఏఐఐబీ, అమృత్ 2.0 పథకంలో రూ. 7.56 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.

నేడు ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఇంద్రపాలెం (కరప), న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఇంద్రపాలెంలో నిర్వహించనున్నట్లు కమిటీ ఛైర్‌పర్సన్ మాసుమేను మంగ తెలిపారు. ఇంద్రపాలెంలో ఆదివారం ఆమె మాట్లాడారు. ఛైర్‌పర్సన్‌గా తనతో పాటు వైస్ ఛైర్మన్‌గా ఎన్ఎస్ఎస్ రామయ్య, సభ్యులుగా బి. సూర్యవతి, జి. రాజేశ్వరి, ఆర్. సత్యసుజన్య, పి. బులివీర్రాజు, ఎన్. ఈశ్వరరావు, ఎం. రామకృష్ణ, పి. శివకుమార్, డి. వెంకటరమణ, జి. వెంకటలక్ష్మి, జి. విజయలక్ష్మి, ఈ. చినవెంకటయ్య, ఎల్. జ్యోతి, బి. నవీన్‌కుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కార్యక్రమం పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ముఖ్య అతిథులుగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే కూటమి లక్ష్యం



వన్నెపూడిలో కరపత్రాలు పంచుతున్న తెదేపా నాయకులు

పిఠాపురం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని తెదేపా మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ అన్నారు. ఆదివారం పిఠాపురం మండలం విరవాడలో క్లస్టర్ 4 పరిధిలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కరపత్రాలు ప్రజలు అందజేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కోల అప్పన్నబాబు, బూత్ కన్వీనర్ కందా నాగేశ్వరరావు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు కోలా రాజు, తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: రెండేళ్లకాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ తెదేపా నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తాటిపర్తి, వన్నెపూడిలో ఆదివారం కరపత్రాలు పంచారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు మడికి సన్యాసిరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

కరప, న్యూస్‌టుడే: అన్నివర్గాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పేర్కొన్నారు. కరప మండలం నడకుదురులో ఆదివారం వారు 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న లారీ గొల్లప్రోలు మండలం వన్నెపూడి శివారులో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న చెందుర్తి గ్రామానికి చెందిన వీరబాబు తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. హైవే మొబైల్ పోలీస్ అధికారులు ఘటనా లస్థలాన్ని పరిశీలించారు. పరిశీలించి కేసు నమోదు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో అన్నసంతర్పణ

పెద్దాపురం: మరిడమ్మ జాతర ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల మండలి ఛైర్మన్ చింతపల్లి శ్రీహర్ష, ఏసీ విజయలక్ష్మి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు వెంకటశాస్త్రి, ప్రసాదశర్మ, ఆసాదులు నాని, విజయ్ పాల్గొన్నారు.

చెరువులున్నా తాగునీటి కష్టాలే!



నీలపల్లిలో చెరువు దుస్థితి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలం నీలపల్లి పంచాయతీ పరిధిలోని రేవువారిపేటలోని రక్షిత చెరువు నిరుపయోగంగా మారింది. చెరువంతా లీకులతో అధ్వానంగా మారింది. నీరంతా రంగు మారింది. నీళ్లు తాగేందుకు ఉపయోగపడట్లేదు. ఆధునికీకరణకు నోచుకోలేదు. రామచంద్రకాలనీ, ఇందిరమ్మకాలనీ, మోకావారిపేట, చెక్కావారిపేట, రేవు వారిపేట, అగ్నికుల క్షత్రియుల పేట, జగనన్న కాలనీ, శ్రీరామ్‌నగర్ గ్రామాలున్నాయి. 6,500 మంది జనాభా ఉన్నారు. జనాభా ప్రకారం రోజుకు 2లక్షల లీటర్ల తాగునీరు అందించాలి. కానీ రోజు విడిచి రోజు అందిస్తున్న నీటి కష్టాలు తప్పట్లేదు.

ఏడేళ్లుగా సమస్యలు..

రేవువారిపేటలో రక్షిత చెరువు నిరుపయోగంగా మారడంతో నీలపల్లి నుంచి పత్తిగొంది వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిని అనుకుని పాన్నేటి చెరువును రక్షిత చెరువుగా మార్చారు. ఏడేళ్ల నుంచి రక్షణ కల్పించలేదు. పాన్నేటి నుంచి పైపులైన్ ద్వారా రేవు వారిపేటలోని పంపుహౌస్‌కు నీటిని పంపిస్తారు. అక్కడ శుద్ధి చేసి ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. పాన్నేటి చెరువుకు రక్షణ కల్పించి రేవువారిపేటలోని రక్షిత చెరువును ఆధునికీకరిస్తే ఇబ్బందులు తీరుతాయని గ్రామస్థులు తెలిపారు. సమస్యను ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి పి. రమేష్ దృష్టికి తీసుకెళ్లగా రక్షిత చెరువులో పనులు చేపట్టేందుకు పంచాయతీ నిధులు రూ. 6లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం మేలు

రమణయ్యపేట (కరప), న్యూస్‌టుడే: దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం మేలని ఆయుర్వేద వైద్యురాలు డా. రమ్య అన్నారు. కాకినాడ గ్రామీణ మండలం రమణయ్యపేట బోటు క్లబ్ ఉద్యానంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేదం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రజలందరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎ. రత్నప్రసాద్, డా. దాసరి శ్రీధర్, కె. శ్రీరామరాజు, రామకృష్ణరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బాలికల జిల్లా జట్టు

తుని, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా పోటీలకు అండర్ 14 విభాగంలో బాల, బాలికల జిల్లా జట్లు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా సహకార్యదర్శి విక్టర్‌బాబు తెలిపారు. పట్టణంలోని రాజా క్రీడామైదానంలో ఆదివారం జరిగిన ఎంపిక కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభచూపారు. ఈ రెండు జట్లు సెప్టెంబరు 12, 13 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడతారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం

గోకవరం, న్యూస్‌టుడే: పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాల పూర్వవిద్యార్థి డా.కాటన్‌తో పాటు ఆయన వెంట వచ్చిన ఇతర వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఔషధాలు, ఇంజెక్షన్లను నిల్వ చేసేందుకు వీలుగా రూ.20 వేలు విలువైన రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. విద్యార్థులు ఆడుకునేందుకు రూ.32 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సృజన్, కార్యదర్శి శ్రీనివాస్, ఇతర సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని రథసేవ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని రథసేవ ఆదివారం ఘనంగా జరిగింది. ప్రతివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి ఆలయప్రాకారం చుట్టూ ఊరేగించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.



శంఖవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్యప్రభ

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

శంఖవరం, న్యూస్‌టుడే: శంఖవరంలోని నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయ విగ్రహప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు గావించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్, పార్టీ మండలాధ్యక్షుడు ఈగల దేవుళ్లు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



గుర్రంపాలెంలో పట్టాభిరామ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఆలయ నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుర్రంపాలెంలో వందేళ్ల చరిత్ర కలిగిన పట్టాభిరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం శంకుస్థాపన చేశారు. తితిదే శ్రీవాణి ట్రస్టు నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేసి ఈ ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తులు, గ్రామస్థులు, దాతలతో కలిసి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సీతారామపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నెహ్రూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలు, గ్రామస్థులను అభినందించారు. జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, ఎస్వీయస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటకు నిబంధనలు సరే..
మైదానాలే కరవు

శంఖవరం, ఏలేశ్వరం, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరం. దీన్ని గుర్తించిన ప్రభుత్వాలు క్రీడలను విద్యలో భాగం చేశాయి. ప్రతి తరగతిలో రోజూ ఒక పిరియడ్‌ను ఆటలకు కేటాయించాలనే నిబంధనలు ఉన్నాయి. ఏటా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సైతం ప్రభుత్వం విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తోంది. అయితే ఆయా పాఠశాలల్లో సదుపాయాలు, మైదానాలు లేక అనేకమంది ఆటలకు దూరమయ్యే పరిస్థితి. మైదానాలు ఉన్న పాఠశాలల్లో కొన్ని అభివృద్ధి పరచాల్సి ఉంది.

● నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో 182 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 41 ఉన్నత పాఠశాలల్లో కేవలం 19 బడులకు మాత్రమే మైదానాలు ఉన్నాయి.

● ప్రత్తిపాడు మండలంలో గజ్జనపూడి, పెద్దిపాలెం, చిన్నశంకర్లపూడి, పెదశంకర్లపూడి, పోతులూరు ఉన్నత పాఠశాలలకు మైదానాలు అవసరం. ● రౌతులపూడి మండలంలో ఉన్న ఎస్.అగ్రహారం, లచ్చిరెడ్డిపాలెం, ములగపూడి ఉన్నత పాఠశాలల్లో ఉన్న మైదానాలను అభివృద్ధి పరచాలి. ● శంఖవరం మండలంలో టి.అగ్రహారం, మండపం, జి.కొత్తపల్లి, కె.కొత్తురు ఉన్నత పాఠశాలలకు అసలు మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దురమవుతున్నారు.



ఖాళీస్థలం లేని టి.అగ్రహారం ఉన్నత పాఠశాల

ఉన్న వాటిలోనే నిర్వహిస్తున్నాం..

చాలాచోట్ల మైదానాలు లేక ఇబ్బందులు ఉన్నాయి. మైదానాలు లేని చోట ఆయా గ్రామాల్లో దగ్గరలో ఉన్న ఖాళీ స్థలాల వద్ద ఆటలు ఆడిస్తున్నాం. - ఎస్వీ రమణ, రాజబాబు, ఎంఈవోలు శంఖవరం, ప్రత్తిపాడు

చదరంగం ఆటపై అవగాహన



శిక్షణకు హాజరైన విద్యార్థులు

తుని, న్యూస్‌టుడే: చదరంగం ఎలా ఆడాలి.. ఎత్తుకు పైఎత్తు ఎలా వేయాలని... విద్యార్థులకు పలువురు అవగాహన కలిగించారు. పీపుల్స్ ఎడ్యుకేటెడ్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు ఆటలో వ్యూహ రచన, మెలకువలు ఆసక్తిగా నేర్చుకున్నారు. ఫోరం ప్రతినిధులు టి.శేషగిరి మాస్టారు, జి.రాము, ఈ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ కార్యదర్శిగా రమణ

తుని, న్యూస్‌టుడే: స్టేట్ టూవీలర్స్ మెకానిక్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా తుని పట్టణానికి చెందిన బొబ్బిలి వెంకట రమణ నియమితులయ్యారు. ఒంగోలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దాయినేని ధర్మ ఈమేరకు ప్రకటించారు. సుదీర్ఘ కాలంగా సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి ఆయన పాటుపడ్డారని పలువురు అభినందించారు.

హడలెత్తిస్తున్న శునకాలు

• పెరుగుతున్న బాధితులు

గండేపల్లి, న్యూస్‌టుడే: చిన్నా, పెద్దా లేదు. వాటికి చిక్కితే పిక్కలు పీకడం ఖాయం. ఏ వీధిలో చూసినా సమూహంగా ఉంటూ శునకాలు బెదిరిస్తున్నాయి. ఒక్కసారి పిచ్చికుక్క కరవడం మొదలు పెడితే బాధితుల సంఖ్య పదుల్లో ఉంటుంది. ఒక్కోసారి గుంపులుగా చిన్నారులపై దాడికి పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. ఇవి హఠాత్తుగా ఏ మూల నుంచి వచ్చి దాడిచేస్తాయో ఎవరికి అంతుబట్టదు.

ప్రధాన కారణాలు..

శునకాలకు కొన్నేళ్లుగా గర్భ నియంత్రణ వ్యాక్సిన్లు వేయక పోవడంతో ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. పట్టణాలు, గ్రామాల్లో మాంసం దుకాణాలు పెరగడం వాటి వ్యర్థాలను కుక్కలకు వేస్తున్నారు. పంచాయతీ అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జనవరి- ఆగస్టు 28 వరకు బాధితులు

ఆసుపత్రి	చికిత్స పొందిన వారు
జడ్.రాగంపేట	930
గండేపల్లి	370
కిర్లంపూడి	387
రాజపూడి	370
కాట్రావుపల్లి	297

ఇటీవల దాడులు..

గతేడాది మల్లేపల్లిలో పిచ్చికుక్క దాడిలో 8 మంది గాయపడ్డారు. జడ్.రాగంపేట గ్రామంలో చిన్నారులు ఆడుకుంటుండగా కుక్క దాడికి దిగింది. ఈ ప్రమాదంలో బాలుడుకి పలుగాయాలయ్యాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు బయటకు వెళ్లాలన్నా భయాందోళనకు గురవుతున్నామని వాపోతున్నారు. ద్విచక్రవాహనాలపైన వెళ్లేవారిని సైతం ఇవి వెంబడిస్తున్నాయి. అధికారులు చొరవ తీసుకుని కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జడ్.రాగంపేటలో శునకాల గుంపు

అధికారులు చొరవ తీసుకుంటే వ్యాక్సిన్‌లు వేస్తాం..

గ్రామాల్లోకి వెళ్లి వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయడం అనేది ఏమి లేదు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుంటే రేబిస్ వ్యాక్సిన్‌లు వేస్తాం. కాకినాడ, రాజమహేంద్రవరం వాహనాల్లో తరలించి (గర్భసంచిలు)తొలగించే శస్త్ర చికిత్సలు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, పశువైద్య అధికారి, గండేపల్లి



చెత్తకు నిప్పు.. పొగతో ముప్పు

జాతీయ రహదారి ప్రక్కన బెండపూడి వద్ద నిల్వ ఉన్న చెత్త కుప్పలకు నిప్పు పెట్టారు. దీంతో అటువైపుగా ప్రయాణం సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తొండంగి

ఘనంగా భరతమాత పూజ కార్యక్రమం



పూజలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, చిన్నారులు

జగ్గంపేట గ్రామీణం: రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా భరతమాత పూజ కార్యక్రమం జగ్గంపేటలో ఘనంగా నిర్వహించారు. ఖండ ప్రచారక్ ప్రముఖ్ పాబోలు సీతారామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులతో గీతాలాపన చేశారు. స్వామి మాట్లాడుతూ.. ప్రజల్లో జాతీయభావం, దేశభక్తి, ఐకమత్యం మరింతగా జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఆర్ఎస్ఎస్ శాఖలు నిర్వహిస్తూ సమాజంలో జాతీయస్పృహను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు ఒక పాఠశాల కావాలి అనే భావనతో కుటుంబం నుంచి విలువలు, సంస్కారం, దేశభక్తి పెంపొందించాలని సూచించారు. గున్నాబత్తుల అనూష వందేమాతరం గీతాన్ని ఆలపించి వందన సమర్పణ చేశారు. మారిశెట్టి సూర్యనారాయణ, సూర్యలక్ష్మి, జ్యోతి, తమ్మన రఘు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు ఎదుర్కొంటున్న సమస్యలను మా దృష్టికి తీసుకురావొచ్చు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరిస్తాం.

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 గండేపల్లి: 79950 67052

సమస్య: జడ్.రాగంపేట గ్రామంలో ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు పూడిక తీయక ఇబ్బందులు పడుతున్నాం. – హరీష్, జడ్.రాగంపేట

సమాధానం: గ్రామంలోని కాలువల్లో మురుగును తీయించి ఇబ్బందులు లేకుండా చేస్తాం. – తరంగిణి, కార్యదర్శి – న్యూస్‌టుడే, గండేపల్లి,

సమస్య: కుమ్మరిలోవ సచివాలయం సమీపంలో ప్రధాన రహదారి వెంబడి మురుగు కాలువలు లేకపోవడంతో రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు, వాహనదారులు రోజూ ఇబ్బందులు పడుతున్నాం. – సత్యనారాయణ, కుమ్మరిలోవ

సమాధానం: సమస్యను పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి తాత్కాలికంగా కచ్చాకాలువల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

సమస్య: తేటగుంట జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రయించి దుకాణ సముదాయాలు నిర్మిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం – వీరవెంకట రమణ, తేటగుంట.

సమాధానం: సమస్యను సచివాలయ సిబ్బంది కార్యదర్శికి, వీఆర్వోకు తెలియజేసి సమాచారం సేకరించి తదనంతరం చర్యలు చేపడతాం. – రవికుమార్ వర్మ, ఎంపీడీవో, తుని మండలం.

– న్యూస్‌టుడే, తుని గ్రామీణం

నారు ఉంది.. నీరే లేదు..!

వరుణుడు కరుణిస్తాడనే ఆశతో రైతు నారు మడులు వేశారు. దేవుని దయతో వర్షం వస్తే నాట్లు వేద్దామనుకున్నారు. ఆగస్టు నెల పూర్తవుతున్నా చినుకు జాడ లేదు. దీంతో నాట్లు పడక నారుమడులు మాత్రం పచ్చగా కనిపిస్తున్నాయి. విద్యుత్తు బోరు సదుపాయం ఉన్న చోట వేసిన నాట్లు సైతం పూర్తిగా నీరందక ఎండిపోతున్నాయి. తొండంగిలో ఆదివారం ఈ దృశ్యాలు కనిపించాయి. - న్యూస్‌టుడే, తొండంగి



పచ్చగా వరినారు



నీరు లేక ఎండుతున్న వరి నాట్లు

గ్రామస్థులు ఐక్యంగా ఉండాలి



పెద్దిపాలెంలో మాట్లాడుతున్న అనూష యాదవ్

ప్రత్తిపాడు, (ఏలేశ్వరం): రౌతులపూడి మండలం పారుపాక గ్రామస్థులు వివాదాలకు దూరంగా ఉండాలని తెలుగు మహిళా జాగృతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా. అనూష యాదవ్ సూచించారు. పెద్దిపాలెంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ.. రామాలయ నిర్మాణ అంశంపై పారుపాకలో సామాజిక అశాంతి నెలకొనడం దురదృష్టకరమన్నారు. ఆలయ నిర్మాణ వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, తీర్పు వచ్చేంతవరకు యథాతథ స్థితిని కొనసాగించాలన్నారు. 'ఊరికి ఒక రామాలయం ముద్దు - ఒక్కో వర్గానికి రామాలయం వద్దు ' అనే నినాదంతో ప్రజలంతా ముందుకెళ్లాలన్నారు. అభివృద్ధి ప్రదాతగా మంచిపేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ ఈ అంశాన్ని సామరస్యంగా పరిష్కరించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూకరాజు, మణికంఠ, అప్పలస్వామి, విష్ణుదేవరరమణ, వీరబాబు పాల్గొన్నారు.


మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీతో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రఘునాథరావు, సిబ్బంది

తుని పట్టణం, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ గీతా రామకృష్ణ సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కొండవారిపేట, అమ్మాజీపేట, సీతారాంపురం, నెహ్రూనగర్ ప్రాంతాల్లో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ● యువత గంజాయి, డ్రగ్స్, నాటుసారా జోలికి వెళ్లి ఆరోగ్యాలు పాడుచేసుకోవద్దని జగ్గంపేట ఎస్సై రఘునాథరావు అన్నారు. జగ్గంపేటలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసులు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. నెహ్రూ కాలనీ, గోపాల్‌నగర్, శెట్టిబలిజపేట, పల్లపువీధి, మెయిన్‌రోడ్డు మీదుగా వీధుల్లో అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి



సంచార కుటుంబాలతో మాట్లాడుతున్న భాజపా నాయకులు

ప్రత్తిపాడు, (ఏలేశ్వరం), : సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగిలిదేవి సత్తిరాజు, పార్టీ జిల్లా పూర్వ కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. రాజస్థాన్‌కి చెందిన పలు కుటుంబాలు జీవనోపాధి కోసం వచ్చి ప్రత్తిపాడులోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆదివారం సంచార జాతులను వీరు కలిశారు. సంస్కృతి, సంప్రదాయాలకు సంచార జాతులకు చెందిన వ్యక్తులు వారసులన్నారు. వీరిని గుర్తించి బియ్యం, ఆధార్ కార్డు, ఓటు హక్కు కార్డు వచ్చేందుకు సహకరిస్తామన్నారు. భాజపా జిల్లా కార్గవర్గ సభ్యుడు మదినే బాబ్జీ, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని కొబ్బరితోట ప్రాంతానికి చెందిన తన కుమారుడు కొద్ది రోజులుగా కనిపించడం లేదని డి.వర్మ ఫిర్యాదు చేశారని ఏఎస్సై టీవీ రత్నం తెలిపారు. బీటెక్ పూర్తిచేసిన ఫణీంద్ర వర్మ ఈనెల 25న ఉద్యోగం చూసుకుంటానని ఇంటి నుంచి వెళ్లాడని, తర్వాత ఏ విధమైన సమాచారం లేదన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పశువులు పట్టివేత

తుని, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నామవరం నుంచి జగ్గంపేటకు తరలిస్తున్న 18 పశువులను పట్టుకున్నామని ఏఎస్సై జయంత్ తెలిపారు. వ్యానులో వీటిని అక్రమంగా తరలిస్తుండగా సీతారాంపురం జంక్షన్‌లో పట్టుకున్నామన్నారు. పశువులను ఏలేశ్వరం సమీపంలో ఉలిగోగులపాడు గోశాలకు పంపామన్నారు.

వృత్తి శిక్షణ.. భవితకు రక్షణ

కోటనందూరు, తొండంగి, న్యూస్‌టుడే: విద్యార్థినులకు ఉత్తమ విద్యను అందించడంతో పాటు వారిలో నైపుణ్యాలు పెంపు, సమగ్రాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పేదింటి బాలికలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతూ భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ద్వారా వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తోంది. దీంతో విద్యార్థినులు అల్లికలు, కుట్లు, డ్రాయింగ్, పుల్లలతో బొమ్మల తయారీ, పూలగుత్తుల తయారీ, వ్యవసాయం తదితర వాటిలో శిక్షణ తీసుకుంటూ ఆత్మస్థైర్యంతో జీవితంలో రాణించేందుకు సంసిద్ధమవుతున్నారు. అల్లిపూడి కేజీబీవీలో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు సుమారు 200 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. రోజూ సాయంత్రం గంట పాటు శిక్షణ ఇస్తున్నారు.



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

భవిష్యత్తుకు ఆసరాగా..

వృత్తి విద్యా కోర్సుల్లో ఇస్తున్న శిక్షణ తమకు భవిష్యత్తులో ఉపాధి ఆసరాగా ఉంటుందని విద్యార్థినులు చెబుతున్నారు. పలు కారణాలతో 'పది'తో చదువు ఆపేసిన వారికి ఈ శిక్షణ ఎంతగానో ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తోంది. అల్లిపూడి కేజీబీవీలో 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థినులకు ప్రకృతి వ్యవసాయం, పెరటి తోటల పెంపకంపై కూడా శిక్షణ ఇస్తున్నారు.

ఇష్టంగా నేర్చుకుంటున్నాం..

చదువుతో పాటు వివిధ నైపుణ్యాలు ఉంటేనే రాణిస్తామని అర్థమైంది. అల్లికలు, కుట్లు, డ్రాయింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నాం. రకరకాలు అలంకరణ వస్తువులు, దేవుళ్ల చిత్రపటాలు వంటివి తయారు చేస్తున్నాం. ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం.



- తేజోర్మయి, రమ్య, బాల, శివాని రమ్య

స్వశక్తితో ముందుకు సాగుతాం..

చదువుతో పాటు నేర్చుకున్న ఈ శిక్షణ మాలో ధైర్యాన్ని నింపుతుంది. మా విద్యాలయంలో వీటిని చాలా మంది ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. ఉపాధ్యాయులు ఓర్పుతో నేర్పించే విధానం బాగుంది.

- శివాని రమ్య, త్రిపుర, భువనేశ్వరి